నేటి కందం- నేటికి అందం



తీరుగ వనజన్ముల కై
నారాకుల చంద్రబాబు నాయుడు ప్రేమన్
పారించుచు జరిపించెను
పారీంద్రమ్మగుచు"నాది వాసీ దినము"న్ !!

(ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అడవి బిడ్డలకు తన ఆత్మీయమైన భరోసాను ప్రకటించారు

-రాధశ్రీ
సెల్:9494481210



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

చురక

నకిలీ ఓట్ల నమోదు
నగ్నంగా జరుగుతుందా
ఇ సి దృష్టి దానిపైన
ఇంతకూడా పెట్టకుందా
ప్రతిపక్షం గొంతుచించి
ప్రశ్నిస్తూ అరుస్తుంది
పట్టించుకోక ఎట్లా
ప్రభుత్వం మురుస్తుంది

-వేల్పుల నారాయణ
9440433475



హైదరాబాద్ ఆదివారం 10-8-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-50 001. సంపుటి :32 సంచిక:7 పేజీలు:6 వెల: రూ.1/-


## మాటలతో నిర్వచించలేనిది మా అనుబంధం : సీఎం రేవంత్



హైదరాబాద్, ఆగష్టు 9: రాఖీ పౌర్ణమి సందర్భంగా తెలంగాణ మహిళలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ నేపథ్యంలో మంత్రి సీతక్క రేవంత్ రెడ్డి నివాసానికి చేరుకుని ఆయనకు రాఖీ కట్టారు. అనంతరం మంత్రి సీతక్కతో తన అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు రేవంత్. సోదరి సీతక్క పట్ల ఉన్న అనురాగాన్ని ప్రతిబింబిస్తూ.. ఎక్స్ వేదికగా సీఎం ఎమోషనల్ పోస్ట్ పెట్టారు.

'అక్షరాలతో రచించలేనిది? మాటలతో నిర్వచించలేనిది? సీతక్కతో నా అనుబంధమని, ప్రతి రాఖీ పౌర్ణమి నాడు ఆ బంధం మరింతగా వికసిస్తూనే ఉంటుందంటూ'.. సీతక్కతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుని భావోద్వేగానికి లోనైయ్యారు సీఎం రేవంత్. తనకు రాఖీ కట్టిన మంత్రి కొండా సురేఖ, సీనియర్ నాయకురాలు గీతారెడ్డి, మహిళా కమిషన్ ఛైర్మన్ నేరెళ్ల శారద, ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ సుజాతకు ఈ సందర్భంగా సీఎం ధన్యవాదాలు తెలిపారు.

## 334 రాజకీయ పార్టీలను.. జాబితా నుంచి తొలగించిన ఈసీ

న్యూఢిల్లీ, ఆగష్టు 9:దేశవ్యాప్తంగా 334 రాజకీయ పార్టీలను రిజిస్టర్ జాబితా నుంచి ఎన్నికల సంఘం (ఈసీ) తొలగించింది. 2019 నుంచి ఏ ఒక్క ఎన్నికల్లో పోటీ చేయని ఈ రాజకీయ పార్టీలపై ఈ నిర్ణయం తీసుకున్నది. ఈసీ వద్ద రిజిస్టర్ అయినప్పటికీ గుర్తింపులేని 334 రాజకీయ పార్టీలు 2019 నుంచి ఆరేళ్లలో ఏ ఒక్క ఎన్నికల్లో కూడా పోటీ చేయలేదని ఈసీ తెలిపింది. ముఖ్యమైన ఈ షరతును నెరవేర్చడంలో విఫలమైనందుకు రిజిస్టర్ అయిన 334 గుర్తింపు లేని రాజకీయ పార్టీలను జాబితా నుంచి తొలగించినట్లు శనివారం పేర్కొంది.

కాగా, గుర్తింపు లేని ఈ 334 రాజకీయ పార్టీలు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందినవని ఈసీ తెలిపింది. అయితే జాబితా నుంచి తొలగించిన ఈ పార్టీల కార్యాలయాలు భౌతికంగా కూడా ఎక్కడా లేవని పేర్కొంది. మొత్తం 2,854 నమోదిత గుర్తింపు లేని రాజకీయ పార్టీల్లో 334 పార్టీల తొలగింపు తర్వాత 2,520 రాజకీయ పార్టీలు రిజిస్టర్ జాబితాలో ఉన్నట్లు ఈసీ వివరించింది. ప్రస్తుతం ఆరు జాతీయ పార్టీలు, 67 రాష్ట్ర పార్టీలు ఉన్నాయని వెల్లడించింది.

## తెలంగాణలో ఎన్టీపీసీ రూ. 80 వేల కోట్ల ఫ్లోటింగ్ సోలార్ పెట్టుబడులు



హైదరాబాద్, ఆగష్టు 9 : తెలంగాణకు బొఖఅ పెద్ద గుడ్ న్యూస్ చెప్పింది. విద్యుత్ ఉత్పత్తి రంగంలో దేశంలోనే అగ్రగామి అయిన ఎన్టీపీసీ.. తెలంగాణ రాష్ట్రంలో భారీ పెట్టుబడులకు సన్నద్ధమైంది. సంస్థ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ గురుదీప్ సింగ్ నాయకత్వంలోని ప్రతినిధుల బృందం సీఎం రేవంత్ రెడ్డితో భేటీ అయింది. జూబ్లీహిల్స్‌లోని సీఎం రేవంత్ నివాసంలో జరిగిన ఈ భేట లో తమ భవిష్యత్ ప్రణాళికలను సింగ్ వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో సౌర, పవన విద్యుత్ ఉత్పత్తి ప్రాజెకులపై దాదాపు రూ.80,000 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నట్లు ఎన్టీపీసీ తెలిపింది. ముఖ్యంగా ఫ్లోటింగ్ సోలార్ (నీటి మీద తేలియాడే సౌర విద్యుత్ ప్లాంట్లు) ద్వారా తెలంగాణలో సుమారు 6,700 మెగావాట్ల ఉత్పత్తి సాధ్యమని సంస్థ ప్రతినిధులు వివరించారు.

ఈ తరహా ప్రాజెక్టులు రాష్ట్రానికి శక్తి ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడమే కాకుండా.. పర్యావరణ పరిరక్షణతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించవచ్చని ఎన్టీపీసీ స్పష్టం చేసింది. భూమి వినియోగం లేకుండా విద్యుత్ ఉత్పత్తి వంటి అనేక లాభాలను ఈ తరహా ప్రాజెక్టు లు అందిస్తాయని ముఖ్యమంత్రికి ఎన్టీపీసీ ప్రతినిధులు వివరించారు. పెరుగుతున్న విద్యుత్ అవసరాలను తీర్చడంలో థర్మల్, జల విద్యుత్ ఉత్పత్తిపై ఆధారపడుతున్న తెలంగాణకు, ఈ పునరుత్పాదక ఇంధన పెట్టుబడులు కీలక మలుపు అవుతాయని సీఎం రేవంత్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్టీపీసీ ప్రతిపాదనకు ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తుందని ముఖ్యమంత్రి ఎన్టీపీసీ ప్రతినిధులకు హామీ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రంలోని పెద్ద రిజర్వాయర్లు, జలాశయాలు ఈ ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టులకు అనువైన వనరులుగా మారనున్నాయని నిపుణులు భావిస్తున్నారు.

## దేశ రాజకీయ వ్యవస్థ శుభ్రపరిచే దిశగా ఈసీ కీలక నిర్ణయం..

న్యూఢిల్లీ, ఆగష్టు 9:దేశ రాజకీయ వ్యవస్థలో పారదర్శకత, చురుకుదనం పెంచే లక్ష్యంతో కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) కీలక నిర్ణయం తీసుకుంది. గత ఆరు సంవత్సరాల్లో కనీసం ఒక్క ఎన్నికలో కూడా పాల్గొనకుండా ఉన్న 334 రాజకీయ పార్టీల రిజిస్ట్రేషన్‌ను రద్దు చేస్తున్నట్లు శనివారం అధికారికంగా ప్రకటించింది. కేవలం పేరుకే ఉన్న ఈ పార్టీలను జాబితా నుంచి తొలగించడం ద్వారా ఎన్నికల ప్రక్రియను శుభ్రపరిచే ప్రయత్నం చేస్తున్నట్లు ఈసీ స్పష్టం చేసింది.

ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం, రిజిస్టర్ అయిన ప్రతి పార్టీ క్రమం తప్పకుండా ఎన్నికల్లో పోటీ చేయాలి. కానీ 2019 నుంచి ఇప్పటివరకు ఈ 334 పార్టీలు ఒక్క అభ్యర్థినీ రంగంలోకి దింపలేదు. అంతేకాకుండా, రిజిస్ట్రేషన్ సమయంలో అందించిన చిరునామాలలో వీటి కార్యాలయాలు లేవని క్షేత్రస్థాయి తనిఖీల్లో తేలింది. ఈ రెండు నిబంధనలను పాటించకపోవడంతోనే వీటి గుర్తింపును రద్దు చేసినట్లు ఈసీ తెలిపింది. ఈ నిర్ణయానికి ముందు దేశంలో 2,854 రిజిస్టర్డ్ గుర్తింపు లేని పార్టీలు ఉండగా, ఇప్పుడు 334 పార్టీలు తొలగించడంతో సంఖ్య 2,520కి తగ్గింది. ఈ చర్య దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో వర్తిస్తుంది. అయితే, ఈ చర్య కేవలం గుర్తింపు లేని పార్టీలకే పరిమితమని, ప్రస్తుతం చురుకుగా ఉన్న 6 జాతీయ పార్టీలు, 67 రాష్ట్ర స్థాయి పార్టీలు ప్రభావితం కావని ఈసీ స్పష్టం చేసింది. ఎన్నికల వ్యవస్థలో జవాబుదారీతనం, నమ్మకాన్ని పెంపొందించేందుకు ఇలాంటి చర్యలు భవిష్యత్తులో కూడా కొనసాగుతాయని ఎన్నికల సంఘం వర్గాలు తెలిపాయి.

## హైదరాబాద్‌లో పలు చోట్ల భారీ వర్షం.. ఈదురుగాలులు



హైదరాబాద్, ఆగష్టు 9: రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. బలమైన ఈదురుగాలులు కూడా వీచాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భారీ ఈదురుగాలులకు వృక్షాలు నేలకొరిగాయి. విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది.

హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్, వనస్థలిపురం, ఎల్‌బీనగర్, చాంద్రాయణగుట్ట, బాలాపూర్, బీఎన్ రెడ్డి నగర్ ఏరియాల్లో వాన దంచికొట్టింది. ఇప్పటికే ట్రాఫిక్ జామ్ కావడంతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు.. ఈ భారీ వర్షం మరింత కష్టాన్ని తెచ్చిపెట్టింది. రోడ్లపై వర్షపు నీరు నిలిచిపోవడంతో.. వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రాబోయే రెండు గంటల్లో వికారాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, నిజామాబాద్, గద్వాల్, వనపర్తి, నారాయణపేట, కామారెడ్డి జిల్లాల్లో భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. కాబట్టి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లోనే బయటకు రావాలని సూచించారు.

## రానున్న ఏడు రోజుల్లో భారీ వర్షాలు..హెచ్చరించిన భారత వాతావరణ శాఖ

హైదరాబాద్, ఆగష్టు 9:తెలంగాణలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో భారత వాతావరణ శాఖ మరోసారి హెచ్చరికలు జారీ చేసింది. తెలంగాణలో ఇవాళ్టి(శనివారం) నుంచి 15వ తేదీ వరకూ.. అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. రానున్న 7 రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా వర్షలు పడే ఛాన్స్ ఉందని స్పష్టం చేసింది. వర్షాలకు సంబంధించిన సూచనలు, హెచ్చరికలను ఓ ప్రకటన ద్వారా వాతావరణ శాఖ విడుదల చేసింది. ఆదిలాబాద్, కొమరంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో 10, 11 తేదీల్లో భారీ వర్షాలు పడుతాయని వాతావరణ శాఖ పేర్కొంది. ఆ జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తుంది. 12, 13, 15 తేదీల్లో ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్ధిపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో భారీ వర్షం కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులు(గాలి వేగం గంటకు 30-40 కి.మీ)తో కూడిన వర్షాలు అక్కడక్కడా కురుస్తాయని భారత వాతావరణశాఖ స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం అధికారులను అప్రమత్తం చేసింది. పోలీసులు, వివిధ విభాగాల అధికారులతో సహా.. కలెక్టర్లు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించింది. అన్ని విభాగాలతో సమన్వయం చేసుకుంటూ.. ప్రజల రక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించింది.

## కేసీఆర్‌కు రాఖీ కట్టిన సోదరీమణులు..



హైదరాబాద్, ఆగష్టు 9:ఎర్రవల్లిలోని కేసీఆర్ వ్యవసాయ క్షేత్రంలో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా జరిగాయి. బీఆర్ఎస్ పార్టీ చీఫ్, రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఆయన సోదరీమణులు రాఖీ కట్టారు. అక్కాచెల్లెళ్లు కలిసి కేసీఆర్‌కు హారతి పట్టి, రాఖీలు కట్టి, మిఠాయిలు తినిపించి ఆశీర్వదించారు. ఈ రాఖీ వేడుకల్లో కేసీఆర్ సతీమణి శోభ, అక్కలు లక్ష్మీబాయి, జయమ్మ, చెల్లెలు వినోదమ్మ పాల్గొన్నారు.

## నిర్మాతలతో చర్చలు విఫలం.. ఆందోళనలు ఉధృతి చేయనున్న ఫిల్మ్ ఫెడరేషన్..!



హైదరాబాద్, ఆగష్టు 9:టాలీవుడ్‌లో వేతనాల పెంపు కోసం సినీ కార్మికులు చేపట్టిన సమ్మెను విరమింపజేయడం కోసం చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. నిర్మాతలతో ఫిల్మ్ ఫెడరేషన్ నాయకులు నిర్వహించిన చర్చలు కొలిక్కి రాలేదు. దాంతో. రేపటి నుంచి ఆందోళనను మరింత ఉధృతం చేసేందుకు సిద్ధమవుతున్నారు ఫెడరేషన్ నాయకులు. శనివారం నిర్మాతలతో జరిపిన సుదీర్ఘ సమావేశం నిరాశను మిగల్చిందని ఫిల్మ్ ఫెడరేషన్ ఛైర్మన్ అనిల్ తెలిపారు.

రోజు వారీ వేతనాలు తీసుకునే 13 సంఘాలకు ఒకేరకమైన వేతనాలు పెంచాల్సిందేనని ఫెడరేషన్ నాయకులు పట్టుబట్టారు. నిర్మాతల నిర్ణయాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని వారు స్పష్టం చేశారు. అంతేకాదు నిర్మాతలు పెట్టిన నాలుగు షరతులకు సైతం అంగీకరించేది లేదని తేల్చి చెప్పిన ఆయన.. యూనియన్ల ఐక్యతను దెబ్బతీసేలా ప్రొడ్యూసర్స్ నిర్ణయాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఫెడరేషన్‌ను విభజించేలా వేతనాల నిర్ణయం ఉందని నిర్మాత వల్లభనేని అనిల్ మండిపడ్డారు.

ఇదిలా ఉంటే.. వేతనాల పెంపు సమస్య తీరకపోతే నా సినిమాకు సోమవారం నుంచి 30 శాతం వేతనాలు పెంచి ఇస్తామని చిరంజీవి హామీ ఇచ్చినట్టు వార్తలు ఊపందుకున్నాయి. ఈ వార్తలపై తాజాగా చిరంజీవి ఎక్స్ ద్వారా స్పందించారు. కార్మికుల వేతనాల పెంపు ఇండస్ట్రీకి సంబంధించిన సమస్య అని. ఈ విషయంలో ఏకపక్షంగా ఎవరూ నిర్ణయం తీసుకోలేరన్నారు మెగాస్టార్.

## నాపై దుష్ప్రచారం చేస్తున్నారు : చిరంజీవి



హైదరాబాద్, ఆగష్టు 9:తెలుగు ఫిలిం ఇండస్ట్రీలో వర్కర్స్ ఫెడరేషన్‌కు చెందిన 24 కార్మిక సంఘాలు వేతనాల పెంపు కోసం సినిమా షూటింగ్‌లను నిలిపివేసి బంద్ కొనసాగిస్తున్నాయని తెలిసిందే. వర్కర్ల ప్రధాన డిమాండ్ వేతనాలను 30 శాతం మేర పెంచాలని.. ఫెడరేషన్ ప్రతినిధులు ఇప్పటికే ఫిలిం ఛాంబర్‌తో చర్చలు జరిపారు. అయితే ఈ చర్చలు సానుకూలంగా జరుగకపోవడంతో నిరసనగా బంద్ ప్రకటించారు. ఈ నేపథ్యంలో కార్మికులు హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో కమిషనర్ ఆఫీసుకు కూడా వెళ్లారు. మరోవైపు సినీ కార్మికుల వేతనాల పెంపు విషయంపై నిర్మాతలు చిరంజీవితో సమావేశమై చర్చలు కూడా జరిపారు.

## ఘనంగా రాఖీ వేడుకలు..

### -తెలంగాణ తొలి స్పీకర్ మధుసూదనాచారికి రాఖీ కట్టిన ఉల్లెంగుల పద్మ



హైదరాబాద్, ఆగష్టు 9: మండల వ్యాప్తంగా రాఖీ పండుగ వేడుకలు ఘనంగా జరిగాయి. వివిధ ప్రాంతాల నుండి ఆడబిడ్డలు తల్లి గారి ఇంటికి వచ్చి సోదరులకు రాఖీ కట్టి దీవించారు.

కరీంనగర్ పర్యటనకు వచ్చిన మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనా చారి మహాత్మానగర్ లోని మాజీ జడ్పీటీసీ ఉల్లంగుల పద్మ ఏకానందం ఇంటికి రాగా ఆమె రాఖీ కట్టి హారతి పట్టారు. అలాగే పలువురు ప్రముఖులు వారి సోదరులకు రాఖీ కట్టి ఆశీర్వదించారు.

## ప్రయాణికులతో కిక్కిరిసిపోయిన జేబీఎస్.. బస్సులు మాత్రం జీరో

హైదరాబాద్, ఆగష్టు 9: సికింద్రాబాద్ జూబ్లీ బస్ స్టేషన్ ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. బస్సులు మాత్రం జీరో. ప్రయాణికులకు సరిపడ బస్సులు లేకపోవడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏదో ఒక బస్సు వస్తే దాంట్లో సీట్ల కోసం ప్రయాణికులు పాట్లు పడుతున్నారు. చంటి పిల్లలను కిటికీల్లో నుంచి లోపలికి తోసేసి.. సీట్లల్లో కర్చీఫ్ వేస్తున్నారు.

రాఖీ పండుగ, ఆదివారం రావడంతో.. చాలా మంది తమ సొంతూర్లకు వెళ్లేందుకు బస్టాండ్లకు ప్రయాణికులు భారీగా చేరుకుంటున్నారు.

దీంతో జూబ్లీ బస్ స్టేషన్ జనంతో కిక్కిరిసిపోయింది. చంటి పిల్లలను ఎత్తుకొని బస్సుల కోసం ప్లాట్ ఫామ్‌పై గంటల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. రెండు గంటలకు ఒక బస్సు రావడంతో ఆ బస్సు ఎక్కడానికి పోటీ పడుతున్నారు. చంటి పిల్లలను చిన్నారులను కిటికీలో నుండి బస్సు లోపలికి పంపిస్తున్నారు.

డ్రైవర్ సీట్ పక్కన ఉండే ఇంజిన్‌పై కూర్చొని ప్రయాణం చేయాల్సిన పరిస్థితి వచ్చింది అని జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సిద్దిపేట, నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్, వరంగల్ తదితర జిల్లాలకు వెళ్లేందుకు గంటల తరబడి జనం నిరీక్షిస్తున్నారు.

## చిన్నారి వైద్యానికి లిటిల్ సోల్జర్స్ టీమ్ ఆర్థిక సాయం

నల్గొండ, ఆగషు 9:నకిరేకల్‌కి చెందిన లిటిల్ సోల్జర్స్ టీం రక్షా బంధన్ రోజు చిన్నారి పాప వైద్య చికిత్సకు సాయం అందించి పెద్ద మనస్సు చాటుకుంది. జనగామ జిల్లా ఘూన్పూర్ మండలం ఇప్పగూడెంకు చెందిన దీకొండ ప్రభాకర్ అనూషల కూతురు ప్రణవి (3) న్యూమోనియా, హార్ట్ బ్లాక్ సమస్యతో బాధపడుతుంది. రోజు డయాలసిస్‌తో హైదరాబాద్‌లోని ఎల్బీనగర్‌లో గల అంకుర హాస్పిటల్ చికిత్స పొందుతుంది. డబ్బులు లేక ఇబ్బంది పడుతున్నారన్న విషయం తెలిసిన నకిరేకల్‌కి చెందిన లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్ మిత్రులు శనివారం ఆస్పత్రికి వెళ్లి పాప చికిత్సకు రూ.22,200 సాయం అందించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మదేవర నరేశ్, కర్నాటి నరేశ్, బట్టిపల్లి వెంకన్న, బొల్లేని నవీన్, బాణోతు రవి పాల్గొన్నారు.

# సింహ జాతిని కాపాడుకుందాం !

(10 ఆగష్టు "ప్రపంచ సింహాల దినం" సందర్భంగా)

'అడవికి రాజు' లేదా 'కింగ్ ఆఫ్ ఫారెస్ట్'గా సింహానికి పేరుంది. గంభీరంగా ఉండే సింహాన్ని చూస్తే భయం కలుగుతుంది. అతి ధైర్యం, కండ బలం కలిగిన సింహారాజు వల్ల అడవుల్లో జీవ వైవిధ్యత స్థిరంగా ఉంటుంది. ఎనిమిది కిమీల వరకు వినిపించే విధంగా గర్జిస్తుంది సింహం. గుంపులు గుంపులుగా సమతల, పచ్చిక బయళ్లలో జీవించే సింహాలు అతి పెద్ద పిల్లుల (బిగ్ క్యాట్స్) వర్గంగా గుర్తించారు. ఆకులు, అలములు తినే శాకాహార జంతువులతో హరిత క్షేత్రాలు తరిగిపోతాయని, ఇలాంటి శాకాహార జంతువులను వేటాడి తను ఆహారంగా తీసుకుంటూ సింహాలు ఇతర అటవీ జంతువుల జనాభాను నియంత్రించడానికి దోహదపడుతుంది. సగటున మగ సింహాలు 418 పౌండ్ల బరువు, ఆడ సింహాలు 277 పౌండ్ల బరువును కలిగిన సింహాలు ఒకే సారి దాదాపు 90 పౌండ్ల మాంసాన్ని తినగలవు.

## అంతరించే జాతుల జాబితాలో సింహాలు !

దాదాపు 10 - 14 ఏండ్లు జీవించగలిగిన సింహాల జనాభా ప్రపంచవ్యాప్తంగా క్రమంగా తగ్గడం ఫలితంగా అంతరించే ప్రమాదం ఉన్న జంతువుల జాబితాలో సింహం కూడా చేరనుందనే విషయం విచారకరం. ప్రపంచవ్యాప్తంగా సింహాల జనాభా 20,000 నుంచి 35,000 వరకు ఉన్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. 2001 నుంచి నేటి వరకు ఆఫ్రికన్ సింహాల జనాభా 43 శాతం వరకు పడిపోవడం గమనించారు. భారత ప్రభుత్వ చొరవతో ఇండియాలో కనిపించే ఏసియాటిక్ సింహాల జనాభా క్రమంగా పెరుగుతూ నేడు 891 వరకు చేరడం జరిగింది. జీవ వైవిధ్యం కాపాడడానికి విధిగా సింహాల జనాభాను కాపాడుకోవలసిన అగత్యం ఏర్పడడంతో ప్రతి ఏట 10 ఆగష్టు రోజున "ప్రపంచ సింహాల దినం" లేదా "వరల్డ్ లయన్ డే" పాటించడం 2013 నుంచి ఆనవాయితీగా మారింది.

## సింహాల జనాభా తగ్గడానికి కారణాలు :

సింహాల జనాభా క్రమంగా తగ్గడానికి కారణాలుగా అడవుల నరికివేత లేదా సింహాల ఆవాసాలు కుచించుకుపోవడం, అవసర ఆహారం దొరక్కపోవడం, ప్రతికూల వాతావరణ మార్పులు, మానవులు- వన్యప్రాణుల మధ్య ఘర్షణ, మానవ అక్రమ వేట, పౌర సమాజ అవగాహన రాహిత్యం లాంటి అంశాలను గుర్తించారు. ప్రపంచ సింహాల దినం వేదికగా ఈ అంశాల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు ప్రభుత్వాలు ప్రత్యేక సింహాల అభయారణ్యాలను ఏర్పాటు చేసి సింహ జాతిని రక్షించడానికి సత్వర చర్యలు తీసుకోవడం అనివార్యంగా తోస్తున్నది. భారత ప్రభుత్వం "ప్రాజెక్టు లయన్ ఏ 2047" పథకాన్ని అమలు పరచడంలో సింహాల సంఖ్య క్రమంగా పెరగడం జరుగుతోంది. సింహాల ఆవాసాలను కాపాడడం, అక్రమ వేటలను కట్టడిచేయడం, ప్రజలకు అవగాహన కలిపించడం, సింహాల అభయారణ్యాలను నిర్వహించడం, సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడం, సుస్థిర పర్యాటకం, సింహాల రక్షణకు అవసరమైన నిధులను విరాళాల రూపంలో జంతు ప్రియుల నుంచి సేకరించడం లాంటి చర్యలు తీసుకోవడం నిరంతరం జరగాలి.

గంభీరంగా ఉండే సింహాల జనాభా కాపాడుకోవడానికి ప్రతినబూనని యెడల రానున్న రోజుల్లో సింహాలు అంతరించే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. భవిష్యత్తు తరాలకు సింహ జాతులను అందించడానికి సత్వరమే పటిష్ట ప్రణాళికలు అమలు పరచాలి, రేపటి తరానికి సింహ రాజులను బహుమతులుగా ఇవ్వాలి.

–డాక్టర్ ॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# సాంకేతిక విద్యలో బహుళ కోర్సుల అభ్యాసం-పరిశోధన మెరుగుకు

## రూ.4,200 కోట్ల మేర బడ్జెట్ మద్దతుపై మంత్రిమండలి ఆమోదం

న్యూఢిల్లీ, ఆగష్టు 9:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర మంత్రిమండలి ఈ రోజు దేశంలోని 275 సాంకేతిక విద్యా సంస్థలలో బహుళ కోర్సుల అభ్యాసం-పరిశోధన మెరుగుదల పథకం (ఎంఈఆర్ఐటీఈ) అమలు ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. మొత్తం 175 ఇంజినీరింగ్ కళాశాలలు, 100 పాలిటెక్నిక్‌లలో ఈ పథకాన్ని అమలు చేస్తారు. జాతీయ విద్యా విధానం-2020 (ఎన్ఈపీ) అనుగుణ కార్యక్రమాల అమలు ద్వారా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో సాంకేతిక విద్య నాణ్యత, సమానత, నిర్వహణ విధానాలను మెరుగుపరచడం దీని లక్ష్యం.

ఈ కేంద్ర ప్రభుత్వరంగ పథకాన్ని రూ.4,200 వ్యయంతో 2025-26 నుంచి 2029-30 వరకు అమలు చేస్తారు. ఈ నిధులలో రూ.2,100 కోట్లు (50 శాతం) ఆర్థిక సంస్థల సహాయం కింద ప్రపంచ బ్యాంకు నుంచి రుణం రూపేణా అందుతాయి.

ఈ పథకం కింద ఎంపిక చేసే 275 ప్రభుత్వ, ఎయిడెడ్ సాంకేతిక విద్యా సంస్థలకు ఆర్థిక మద్దతు లభిస్తుంది. ఈ జాబితాలో జాతీయ సాంకేతిక విద్యా సంస్థలు (ఎన్ఐటీ), రాష్ట్ర ఇంజినీరింగ్ సంస్థలు, పాలిటెక్నిక్‌లు, అనుబంధ సాంకేతిక విశ్వవిద్యాలయాలు (ఏటీయూలు) కూడా ఉంటాయి. వీటితోపాటు సాంకేతిక విద్యా రంగాన్ని పర్యవేక్షించే రాష్ట్ర, కేంద్రపాలిత ప్రాంతాలకూ చేయూత అందుతుంది. మొత్తంమీద దాదాపు 7.5 లక్షల మంది విద్యార్థులు ప్రయోజనం పొందుతారు.

ఈ పథకం అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని ప్రభుత్వ ఇంజనీరింగ్ సంస్థలు, పాలిటెక్నిక్‌లలో 'ఎన్ఈపీ-2020'కి అనుగుణంగా అమలవుతుంది. భాగస్వామ్య సంస్థల నాణ్యత, సమానత, పాలన నైపుణ్యం పెంపు దీని లక్ష్యం. కేంద్ర రంగ పథకంగా ఇది అమలు కానుండగా, భాగస్వామ్య సంస్థలకు కేంద్ర నోడల్ సంస్థ ద్వారా నిధులు బదిలీ అవుతాయి.

ఈ పథకం అమలులో దేశంలోని ఐఐటీలు, ఐఐఎంల వంటి ప్రసిద్ధ విద్యాసంస్థలు, ఏఐసీటీఈ, ఎన్‌బీఏ తదితర ఉన్నత విద్యారంగ నియంత్రణ సంస్థలు కూడా కీలక పాత్ర పోషిస్తాయి.

సమగ్ర, బహుముఖ విధానంతో విద్యార్థుల్లో నైపుణ్యం పెంచి, వారి ఉపాధి సముపార్జన సామర్థ్యాన్ని మెరుగుపరచడంలో ఈ పథకం ప్రధాన భూమిక నిర్వహిస్తుంది. అనుభవ శిక్షణ (ఇంటర్న్‌షిప్) అవకాశాల కల్పన, పారిశ్రామిక రంగ అవసరానుగుణ పాఠ్యాంశాల నవీకరణ, అధ్యాపకత్వ అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణ, పరిశోధన కేంద్రాల ఏర్పాటు వంటివి ఇందులో భాగంగా ఉంటాయి. అంతేకాకుండా సంపోషక (ఇంక్యుబేషన్), ఆవిష్కరణ కేంద్రాలు, నైపుణ్య-తయారీ ప్రయోగశాలలు, భాషా వర్క్ షాప్‌ల కింద మద్దతు లభిస్తుంది. ఈ కార్యక్రమాలన్నీ కాబోయే పట్టభద్రుల ఉపాధి సామర్థ్యం పెంపు, అధిక నియామక అవకాశాలు, అంతిమంగా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని ఇంజినీరింగ్ విద్యార్థులపరంగా నిరుద్యోగం తగ్గించడంలో తోడ్పడతాయి.

ఒక దేశపు సుస్థిర, సమగ్రాభివృద్ధి అధికశాతం సాంకేతిక పరిజ్ఞాన పురోగమనంపై ఆధారపడి ఉంటుంది. ఇందుకోసం విద్యా-పరిశోధన ప్రమాణాల నిరంతర ఉన్నతీకరణ అవశ్యం. ఈ పరిశోధనలు ఆధునిక సవాళ్ల పరిష్కారానికి అనువైన ప్రాథమిక ఆవిష్కరణలకు తోడ్పడటమేగాక దీర్ఘకాలిక సానుకూల ప్రభావం చూపుతాయి. ఈ దృక్పథం ప్రాతిపదికగానే ప్రపంచ బ్యాంకు సహకారంతో 'ఎంఈఆర్ఐటీఈ' పథకం రూపొందింది. ఈ పథకం నిర్దేశించిన కార్యక్రమాలకు 'ఎన్ఈపీ-2020' ద్వారా ఉన్నత విద్యారంగంలో తేదలచిన సంస్కరణలే ఆధారం.

ఈ విధానంలోని ప్రధాన సంస్కరణాంశాల్లో పాఠ్యాంశాల పునర్నవీకరణ, బోధన విధానం, మూల్యాంకనం, సాంకేతిక విద్యలో బహుళ కోర్సుల కార్యక్రమాలు, పరిశోధనావరణ వ్యవస్థ బలోపేతం, భవిష్యత్ విద్యా నిర్వాహకులను తీర్చిదిద్దడం, అధ్యాపక నైపుణ్యం పెంపు, సాంకేతిక విద్యలో లింగపరమైన-డిజిటల్ అంతరాల తగ్గింపు తదితరాలు అంతర్భాగంగా ఉన్నాయి.

ఈ పథకంలో భాగస్వామ్య రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలే కీలక పాత్రధారులు. పథకం అమలులో ప్రధాన పాత్ర పోషించాల్సింది అవే. తదనుగుణంగా అనేక సమావేశాలు, సంప్రదింపుల ద్వారా వాటినుంచి అందిన అభిప్రాయాలు, సూచనలను సముచిత రీతిలో పరిగణనలోకి తీసుకుని పథకానికి రూపకల్పన చేశారు.

# ఛోటా భీమ్ కామిక్ సిరీస్‌ను ఆవిష్కరించిన ప్రచురణల విభాగం..

న్యూఢిల్లీ, ఆగష్టు 9:సరికొత్త 'ఛోటా భీమ్ కామిక్ సిరీస్'ను సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన ప్రచురణల విభాగం ఈ రోజు న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ఆవిష్కరించింది. భారతీయ కథలతో కంటెంటును రూపొందించడాన్ని ప్రోత్సహించడంతో పాటు సంస్కృతితో ముడిపడ్డ కథలను యువ పాఠకుల వద్దకు చేర్చాలన్న నిబద్ధతను పునరుద్ఘాటించడంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మన దేశంలో అత్యంత ప్రజాదరణకు నోచుకున్న బాల పాత్రల్లో ఒకటైన 'ఛోటా భీమ్'కు సంబంధించిన అంశాలపై ఈ కార్యక్రమంలో చర్చను కూడా చేపట్టారు.

ప్రచురణల విభాగం ప్రిన్సిపల్ డైరెక్టర్ జనరల్ శ్రీ భూపేంద్ర కైంథోలా ఈ సందర్భంగా ప్రసంగిస్తూ, "మనం చెప్పే కథలు.. మరీ ముఖ్యంగా పిల్లలకు వినిపించే కథలు, భారతీయతతో ముడిపడి ఉండాలి. మన అవ్వ, తాతలు ఇళ్లలో చిన్న పిల్లలు రాత్రి నిద్రపోయే ముందు వారికి భారతీయ పాత్రలతో కూడిన కథల్ని వినిపించే సంప్రదాయం ఉన్న మన దేశంలో, పబ్లికేషన్స్ డివిజన్ ఈ సంప్రదాయంపై దృష్టి సారించకుండా ఆగిపోలేదు. వాటి గురించి మనం మాతృభాషలో ఎంత ఎక్కువగా మాట్లాడుకొంటే, మన నవ తరం అభివృద్ధి గాథ అంత లోతైన పునాది ఉన్నదిగానూ మారగలుగుతుంది. భారతీయ కథల్లో విలువలు, ధైర్య సాహసాలు నిండి ఉంటాయి కాబట్టి వాటిని అన్ని ప్రాంతాలకూ చేరవేయాల్సిన అవసరం ఎంతయినా ఉంది'' అన్నారు.

గ్రీన్ గోల్డ్ యానిమేషన్ సంస్థ సహకారంతో రూపొందించిన ఈ కామిక్ సిరీస్ ఢోలక్‌పూర్ అనే ఒక కల్పిత రాజ్యంలో ధైర్యవంతుడు, దయార్ద్ర హృదయమున్న ఓ బాలుడు 'భీమ్' చేసే సాహస కృత్యాలను కళ్లకు కడుతుంది. అసాధారణ శక్తికి మారుపేరైన భీమ్.. భారతీయ సంస్కృతి, జానపద కథలతో ప్రేరణను పొందుతాడు.. స్నేహం, సాహసం, జట్టు స్ఫూర్తితో పాటు నైతిక విలువలకు ప్రతీకగా నిలబడతాడు.

గ్రీన్ గోల్డ్ యానిమేషన్ సంస్థ వ్యవస్థాపకుడు, సీఈఓ శ్రీ రాజీవ్ చిలకా మాట్లాడుతూ, "వేవ్స్-2025 వంటి కార్యక్రమాలను కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తూ.. యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్ రంగాల్లో భారతీయ కంటెంటును ప్రోత్సహిస్తోంది. ఈ మద్దతును ఇలాగే అందిస్తూ ఉంటే, ఈ రంగాల్లో ప్రపంచంలో అగ్రగామిగా ఎదగడానికి భారత్ సన్నద్ధురాలవడం ఖాయం" అన్నారు.

ఇటీవల ముంబయిలో నిర్వహించిన వేవ్స్ శిఖరాగ్ర సదస్సులో వ్యక్తమైన స్ఫూర్తిని ఈనాటి కార్యక్రమం ప్రతిఫలిస్తోంది. మన దేశ ప్రేక్షకవర్గాల ఆదరణకు నోచుకొనే, భారతీయ సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించే కంటెంటును రూపొందిస్తూ, భారత సృజనాధార ఆర్థిక వ్యవస్థను బలపరుద్దామంటూ వేవ్స్ శిఖరాగ్ర సదస్సులో పిలుపునిచ్చారు. అన్ని వయసుల వారిని కూడా ఆకట్టుకునే విధంగా రూపొందిన ఈ సిరీస్ పుస్తకాలు.. యానిమేషన్, చలనచిత్రాలు, డిజిటల్ వేదికలలో భారతీయ కథనాలను ప్రోత్సహించాలన్న విశాల జాతీయ లక్ష్యసాధనకు తోడ్పాటును అందిస్తూ బాలల సాహిత్యం పెద్దఎత్తున వచ్చేందుకు తగిన వాతావరణాన్ని ఏర్పరచనుంది.

# వైభవంగా ఆదిదంపతుల గిరిప్రదక్షిణ

## ఇంద్రకీలాద్రి చుట్టూ విహారం

## కొబ్బరికాయ కొట్టి ప్రారంభించిన ఈవో..

విజయవాడ, ఆగష్టు 9: విజయవాడ లోని ఇంద్రకీలాద్రిపై ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో కొలువైయున్న ఆది



దంపతుల గిరి ప్రదక్షణ అత్యంత వైభవంగా కొనసాగింది. శ్రావణ పౌర్ణమి సందర్భంగా ఆదిదంపతులకు నిర్వహించిన ఈ గిరి ప్రదక్షిణలో నగర పురవీధుల్లో స్వామి వారు అమ్మవారు విహరించారు. పౌర్ణమి రోజు ఇంద్రకీలాద్రి చుట్టూ గిరి ప్రదక్షిణ చేయడం వలన కోరిన కోరికలు తీరుతాయని ప్రతీతి. పౌర్ణమి రోజున సకల దేవతలు కొలువైన ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ చేయడం మరింత శ్రేష్టం.

శనివారం పౌర్ణమి సందర్భంగా ఘాట్ రోడ్డు ఎంట్రెన్స్ వద్ద గల శ్రీ కామధేను అమ్మవారి సన్నిధి నుండి ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ వైభవముగా ప్రారంభం అయింది. ఆలయ కార్యనిర్వహణాధికారి వి.కె.శీనానాయక్ ప్రత్యేక పూజలు నిర్వహించి, కొబ్బరికాయ కొట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

తప్పెట్లు, కోలాట నృత్యప్రదర్శనలు, భజన సంకీర్తనా గానం కళా బృందాల కళా ప్రదర్శనలు, మంగళవాయిద్యముల, వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ గిరి ప్రదక్షిణ కార్యక్రమం వైభవం సాగింది. ఘాట్ రోడ్ అమ్మవారి గుడి, కుమ్మరి పాలెం సెంటర్, విద్యాధరపురం, పాల ఫ్యాక్టరీ, చిట్టినగర్, కొత్తపేట, బ్రాహ్మణ వీధి నుండి తిరిగి ఇంద్రకీలాద్రి వరకు గిరి ప్రదక్షిణ కొనసాగింది. వేలాది మంది భక్తులు విశేషముగా ఈ కార్యక్రమంలో పాల్గొని, అమ్మవారిని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ స్థానాచార్య శివ ప్రసాద్ శర్మ, వైదిక కమిటీ సభ్యులు శ్రీధర్ తదితరులు పూజా కార్యక్రమం నిర్వహించారు.

# తిరుపతిలో కల్తీ ఆహారం కలకలం

తిరుపతి, ఆగష్టు 9:: టెంపుల్ సిటీ పవిత్రతను దెబ్బతీసేలా తిరుపతిలో కల్తీ ఆహారం విక్రయాలు భక్తుల ఆరోగ్యానికి ముప్పు తెచ్చిపెడు తున్నాయి. వేలాది మంది భక్తులు తిరుమల దర్శనానికి ముందు తిరుపతిలో ఆగి కాస్త సేదతీరి.. భోజనం చేసి బయలుదేరుతుంటారు. కానీ కొన్ని హోటల్స్, రెస్టారెంట్స్, టిఫిన్ సెంటర్లు మాత్రం మురికితో నిండిన వాతావంణంలో, నాసిరకం పదార్థాలతో వంటకాలను వడ్డిస్తున్నాయి.

ఈ పరిస్థితిని అరికట్టేందుకు ఫుడ్ సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ శాఖలు రెండు రోజుల పాటు సంయుక్త దాడులు జరిపాయి. 20 టీమ్స్‌గా విభజించి తొలి రోజు 30కి పైగా హోటల్స్, రెస్టారెంట్స్‌ను తనిఖీ చేశారు. ఈ సోదాల్లో కుళ్లిపోయిన, బూజు పట్టిన మాంసం, ముందురోజు తయారైన బిర్యానీ, కోడిగుడ్లు, అలాగే పాన్‌షాపుల్లో 34 రోజుల క్రితం తయారైన కిళ్లీలు గుర్తించి సీజ్ చేశారు.

రెండవ రోజు బేకరీలు, స్వీట్ స్టాల్స్, తయారీ కేంద్రాలపై దాడులు జరిగాయి. రేణిగుంటలోని ఈః ఫుడ్స్, క్యూటీ ఫ్రూటీ పరిశ్రమల్లో లైసెన్సులు లేకుండా ఉత్పత్తులు తయారు చేస్తున్నట్లు బయటపడింది. ప్రమాదకర రంగులు, రసాయనాల వాడకం, అపరిశుభ్ర తయారీ వాతావరణం, అలాగే ప్యాకింగ్‌లో అక్రమాలు కూడా గుర్తించారు.

అధికారులు క్రిమినల్ కేసులు నమోదు చేసి, అనుమతులు లేని తయారీ కేంద్రాలను సీజ్ చేశారు. భక్తుల ఆరోగ్యాన్ని, ఆధ్యాత్మిక నగర పవిత్రతను కాపాడటానికి కఠిన చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

# గోడ కూలి.. ఏడుగురు మృతి..



న్యూఢిల్లీ, ఆగష్టు 9:గోడ కూలి ఏడుగురు మృతిచెందిన విషాద ఘటన దేశరాజధాని ఢిల్లీ లో చోటుచేసుకుంది. ఢిల్లీని భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. జైత్ పూర్ లో భారీ వర్షాలకు గోడ కూలడంతో ఏడుగురు మృతిచెందారు. మృతుల్లో ఇద్దరు మహిళలు, ఇద్దరు చిన్నారులు ఉన్నారు. హరినగర్ లో జరిగిన ఈ ప్రమాదంపై సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా ప్రాంతానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. తొలుత 8 మందికి గాయాలవ్వగా వారిని ఆస్పత్రికి తరలించారు.

సఫ్దర్ జంగ్ ఆస్పత్రి ఎయిమ్స్ ట్రామా సెంటర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఏడుగురు మరణించగా.. ఒకరికి మాత్రం చికిత్స కొనసాగుతోంది. అతని పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

మృతులను షబీబుల్ (30), రబీబుల్ (30), రుబీనా (25), ముట్టు అలీ (45), డాలీ (25), రుక్సానా (6), హసీనా (7)లుగా గుర్తించారు. కాగా.. గోడ కూలడానికి గల కారణాలను అధికారులు (రాటటతిఇవతీబ) పరిశీలిస్తున్నారు. భారీ వర్షాల నేపథ్యంలో పాత, శిథిలావస్థలో ఉన్న భవనాల్లో ఉండేవారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు.

# ప్రధానమంత్రి ఉజ్జ్వల యోజన వినియోగదారులకు 12,000 కోట్ల లక్షిత సబ్సిడీ

న్యూఢిల్లీ, ఆగష్టు 9:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రిమండలి సమావేశంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి ప్రధానమంత్రి ఉజ్వల యోజన (పీఎంయూవై) లబ్ధిదారులకు ఇచ్చే సబ్సిడీని కొనసాగించేందుకు మంత్రి వర్గం ఆమోద ముద్ర వేసింది. 14.2 కేజీల సిలిండర్‌కు రూ.300 చొప్పున ఏడాదికి 9 రీఫిల్స్ వరకు ఇచ్చే సబ్సిడీని కొనసాగించాలని (5 కేజీల కనెక్షన్లకు దామాషా ప్రకారం లెక్కిస్తారు) నిర్ణయించింది. దీనికి అయ్యే ఖర్చు రూ.12,000 కోట్లు.

ప్రధానమంత్రి ఉజ్జ్వల యోజన: దేశవ్యాప్తంగా ఉన్న పేద మహిళలకు డిపాజిట్ రహితంగా ఎల్పీజీ సదుపాయం అందించాలనే లక్ష్యంతో 2016, మేలో ప్రధానమంత్రి ఉజ్జ్వల యోజన (పీఎంయూవై)ను ప్రారంభించారు. 01.07.2025 నాటికి దేశవ్యాప్తంగా 10.33 కోట్ల పీఎంయూవై కనెక్షన్లు ఉన్నాయి.పీఎంయూవై లబ్ధిదారులకు ఎలాంటి డిపాజిట్ అవసరం లేకుండా ఎల్పీజీ సదుపాయం లభిస్తుంది. ఈ మినహాయింపులో సిలిండర్ సెక్యూరిటీ డిపాజిట్ (ఎస్డీ), పీడన నియంత్రిక, సురక్ష గొట్టం, గృహావసర గ్యాస్ వినియోగదారు కార్డు (డీజీసీసీ), బుక్ లెట్, ఇన్స్టలేషన్ చార్జీలు ఉన్నాయి. అమల్లో ఉన్న ఉజ్జ్వల 2.0 నిబంధనల ప్రకారం లబ్ధిదారులందరికీ పొయ్యి, మొదటి రీఫిల్ ఉచితంగా అందిస్తారు. ఎల్పీజీ కనెక్షన్ లేదా మొదటి సిలిండర్ లేదా పొయ్యి కోసం పీఎంయూవై లబ్ధిదారులు ఎలాంటి చెల్లింపులు చేయాల్సిన అవసరం లేదు. ఆ మొత్తాన్ని భారత ప్రభుత్వం/ ఓఎంసీలు భరిస్తాయి.

ప్రధానమంత్రి ఉజ్జ్వల యోజన వినియోగదారులకు లక్షిత సబ్సిడీ: ఎల్పీజీ అవసరాల్లో 60 శాతాన్ని భారత్ దిగుమతి చేసుకుంటోంది. అంతర్జాతీయ ఎల్పీజీ ధరల్లో హెచ్చుతగ్గుల ప్రభావం పీఎంయూవై లబ్ధిదారులపై పడకుండా, వారికి మరింత చౌకగా ఎల్పీజీని అందించి, వినియోగాన్ని కొనసాగించేందుకు ప్రభుత్వం లక్షిత సబ్సిడీని అందిస్తోంది. పీఎంయూవై లబ్ధిదారులకు 14.2 కేజీల సిలిండర్ కు రూ.200 చొప్పున ఏడాదికి 12 రీఫిల్స్ కు గాను సబ్సిడీని ప్రభుత్వం 2022 మే లో ప్రారంభించింది (5 కేజీల కనెక్షన్లకు దామాషా ప్రకారం లెక్కిస్తారు). 2023 అక్టోబర్‌లో 14.2 కేజీల సిలిండర్ కు ఏడాదికి 12 రీఫిల్స్ కు గాను రూ.300కు లక్షిత సబ్సిడీ మొత్తాన్ని పెంచింది (5 కేజీల కనెక్షన్లకు దామాషా ప్రకారం లెక్కిస్తారు).పీఎంయూవై గృహాల్లో పెరిగిన ఎల్పీజీ వినియోగం: పీఎంయూవై లబ్ధిదారుల తలసరి వినియోగం (పీసీసీ) 2019-20లో 3 రీఫిల్స్ నుంచి 2022-23 నాటికి 3.68 రీఫిల్స్‌కు, 2024-25 ఆర్థిక సంవత్సరానికి 4.47కు పెరిగింది.

# రోడ్డుప్రమాదం.. ముగ్గురు మృతి..

అమరావతి, ఆగష్టు 9: రోడ్డు ప్రమాదం లో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతిచెందిన విషాద ఘటన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లాలో చోటుచేసుకుంది. జిల్లాలోని ఉలవపాడు మండలం చాకిచెర్ల దగ్గర వ్యాన్‌ను లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు చనిపోయారు .. మరో ఏడుగురికి తీవ్రగాయాలు కాగా దగ్గరలోని ఆస్పత్రికి తరలించారు.

వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని డాక్టర్లు తెలిపారు. తీవ్రంగా గాయపడిన వారిని మెరుగైన వైద్యం కోసం నెల్లూరు కు తరలించారు. వీరంతా పల్నాడు జిల్లా పిడుగురాళ్ల నుంచి తిరుమల శ్రీవారి దర్శనం కోసం వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు చనిపోవడంతో తీవ్ర విషాదం వెంటాడింది.. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ రోడ్డు ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# గుడ్‌న్యూస్ చెప్పిన రైల్వే శాఖ..

## రిటర్న్ టికెట్‌పై 20% డిస్కౌంట్

న్యూఢిల్లీ, ఆగష్టు 9:ప్రయాణికులకు రైల్వే శాఖ గుడ్‌న్యూస్ చెప్పింది. రాబోయే ఫెస్టివల్ రష్ ను దృష్టిలో పెట్టుకొని ఓ సరికొత్త పథకాన్ని ప్రకటించింది. రౌండ్ ట్రిప్ ప్యాకేజీ స్కీమ్ కింద రిటర్న్ టికెట్‌పై 20 శాతం డిస్కౌంట్‌ను ప్రవేశపెట్టింది. పండుగల సీజన్‌లో ప్రయాణికుల రద్దీని నియంత్రించడానికి, సౌకర్యాలను పెంచడానికి ప్రయోగాత్మకంగా ఈ కొత్త పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ విషయాన్ని రైల్వే శాఖ శనివారం ప్రకటించింది.

పండగల సీజన్ షురూ అయ్యింది. వినాయక చవితి, దీపావళి, దసరా తదితర పండగలు దగ్గర్లోనే ఉన్నాయి. ఇక పనినిమిత్తం ఇతర ప్రాంతాల్లో ఉన్న ప్రజలు సొంతూళ్లకు వెళ్తుంటారన్న విషయం తెలిసిందే. ప్రజలు ఎక్కువగా రైలు ప్రయాణాన్నే ప్రిఫర్ చేస్తారు. దీంతో పండగల సీజన్‌లో రైళ్లు రద్దీగా ఉంటాయి. ఈ నేపథ్యంలో ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన ప్రయాణాన్ని కల్పించే ఉద్దేశంతో భారతీయ రైల్వే రౌండ్ ట్రిప్ ప్యాకేజీ స్కీమ్‌తో ప్రయాణికుల ముందుకు వచ్చింది.

రైల్వే మంత్రిత్వశాఖ అధికారిక ప్రకటనలో తెలిపిన వివరాల ప్రకారం.. 2025 ఆగష్టు 14వ తేదీ నుంచి రౌండ్ ట్రిప్ ప్యాకేజ్ స్కీమ్ అమల్లోకి రానుంది. అక్టోబర్ 13వ తేదీ నుంచి అక్టోబర్ 26వ తేదీ మధ్య స్వస్థలాలకు వెళ్లేందుకు టికెట్ బుక్ చేసుకోవాలి. ఆ తర్వాత నవంబర్ 17వ తేదీ నుంచి డిసెంబర్ 1వ తేదీ మధ్యలో తిరుగు ప్రయాణానికి టికెట్ తీసుకోవాలి. ఆన్ లైన్ లేదా ఆఫ్?లైన్ ద్వారా టికెట్ బుక్ చేసుకోవచ్చు. రైల్వే బుకింగ్ వెబ్‌సైట్‌లోని 'కనెక్టింగ్ జర్నీ' ఫీచర్ ద్వారా ప్రయాణికులు ఈ స్కీమ్‌ను ఉపయోగించకోవచ్చు. అయితే, వెళ్లడానికి, తిరుగు ప్రయాణానికి ఒకేసారి టికెట్లు బుక్ చేసుకోవాల్సి ఉంటుంది.ప్రయాణికుల వివరాలు, ప్రయాణించే క్లాస్, బయలుదేరే స్థానం, గమ్యస్థానం ఒకేలా ఉండాలి. రెండు టికెట్స్ కూడా కన్ఫర్మ్ అయితే డిస్కౌంట్ వస్తుంది. ఈ పథకం కింద రిటర్న్ టికెట్ బుకింగ్ చేసేటప్పుడు సాధారణంగా ఉండే 60 రోజుల ముందస్తు రిజర్వేషన్ కాలపరిమితి (ఏఆర్పీ) వర్తించదని రైల్వే మంత్రిత్వశాఖ స్పష్టంచేసింది. 20% రాయితీ తిరుగు ప్రయాణం ప్రాథమిక ఛార్జీపై మాత్రమే ఉంటుంది. రౌండ్ ట్రిప్ ప్యాకేజీ పథకం కింద బుక్ చేసుకున్న టిక్కెట్లకు ఛార్జీల వాపసు కూడా ఉండదు. అలాగే, టికెట్లలో ఎలాంటి మార్పులు చేయడానికి వీలుండదు. ఇక ఫ్లెక్సీ ఫేర్ విధానం ఉన్న రైళ్లు మినహా అన్ని రైళ్లకు, అన్ని క్లాసులు, ప్రత్యేక రైళ్లకు ఈ పథకం వర్తిస్తుంది.




# ఐసీఎంఆర్-ఎస్‌హెచ్ఐఎన్ కార్యక్రమాన్ని నిర్వహించిన ఐసీఎంఆర్

## ఇది సైన్స్, ఆరోగ్య ఆవిష్కరణల్లో తర్వాతి తరం పరిశోధకులుగా విద్యార్థులను ప్రోత్సహించే జాతీయ స్థాయి కార్యక్రమం

న్యూఢిల్లీ, ఆగష్టు 9:"ఒక రోజు శాస్త్రవేత్తగా గడవండి'' అని విద్యార్థులకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు ఆరోగ్య పరిశోధన విభాగం (డీహెచ్ఆర్), భారతీయ వైద్య పరిశోధనా మండలి (ఐసీఎంఆర్) జాతీయ స్థాయిలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించాయి. తన సంస్థలతో పాటు డీహెచ్ఆర్-మోడల్ రూరల్ హెల్త్ రీసెర్చి యూనిట్లు (ఎంఆర్‌హెచ్‌ఆర్‌యూ)లో ఆగస్టు 7, 8 తేదీల్లో ఎస్‌హెచ్ఐఎన్ఈ – సైన్స్, హెల్త్ అండ్ ఇన్నోవేషన్ ఫర్ నెక్స్ట్‌జెన్ ఎక్స్‌ప్లోరర్ పేరుతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

ఈ కార్యక్రమంలో 16 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 39 జిల్లాలో ఉన్న 300 పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఐసీఎంఆర్ సంస్థలను సందర్శించారు. 9 నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న 13,150 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థులకు ఆరోగ్యం, బయోమెడికల్ పరిశోధనా రంగాన్ని పరిచయం చేయడం, జాతీయ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఐసీఎంఆర్ అందిస్తున్న సహకారాన్ని తెలియజేయడం, సైన్స్, ప్రజారోగ్య రంగాల్లో కెరీర్ ఎంచుకొనేలా వారిని ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం ముఖ్యోద్దేశం. తద్వారా 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించేందుకు దోహదపడుతుంది.

ఈ కార్యక్రమంలో డీహెచ్ఆర్ కార్యదర్శి, ఐసీఎంఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ రాజీవ్ బల్ మాట్లాడుతూ.. "ఇది వైజ్ఞానిక ఆసక్తిని పెంపొందించడానికి, ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి, తర్వాతి తరం ఆరోగ్య పరిశోధకులకు స్ఫూర్తినివ్వడానికి ఐసీఎంఆర్ చేపట్టిన ప్రత్యేక కార్యక్రమం" అని అన్నారు. భారతీయ పరిశోధన, ఆరోగ్యసేవల రంగ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో శాస్త్రీయ దృక్పథం, ఆవిష్కరణ, యువత భాగస్వామ్య ప్రాధాన్యాన్ని ఆయన వివరించారు. "ఇది కేవలం సందర్శన మాత్రమే కాదు. శాస్త్రవేత్తగా మారాలని అందిస్తున్న ఆహ్వానం" అని విద్యార్థులను ఉద్దేశించి డాక్టర్ బల్ చెప్పారు. "మీరు పరిశీలించాలని, ప్రశ్నించాలని, శాస్త్రీయ పరిశోధనా స్ఫూర్తిని ప్రత్యక్షంగా తెలుసుకోవాలని మేం కోరుతున్నాం. మా శాస్త్రవేత్తలతో ముచ్చటించండి, ప్రయోగశాలలు పరిశీలించండి, వైద్యారోగ్య రంగంలో భారత్ సాధించిన పురోగతిని తెలుసుకోండి. ఆసక్తి, రుజువు, ఆశయం ద్వారా వికసిత్ భారత్‌ను మనం సాధించగలుగుతాం" అని అన్నారు.

ఈ కార్యక్రమంలో ప్రయోగశాల పర్యటనలు, పరిశోధనలపై ప్రదర్శనలు, పోస్టర్ వాక్ లు, వీడియో ప్రజంటేషన్లు, ప్రస్తుతం జరుగుతున్న సైన్స్ సంబంధిత కార్యక్రమాలపై ప్రత్యక్ష ప్రదర్శనలు వంటి పరస్పరం పాల్గొనే కార్యకలాపాలను నిర్వహించారు. ఐసీఎంఆర్ శాస్త్రవేత్తలతో ప్రత్యక్షంగా మాట్లాడేందుకు, వారి పరిశోధనలు, వారు నైపుణ్యం చూపిన అంశాలు, ప్రజారోగ్యంలో వారి రోజువారీ పని గురించి అవగాహన పొందడానికి విద్యార్థులకు అవకాశం లభించింది. విద్యార్థులను మరింత ఆకట్టుకునేలా డాక్టర్ క్యూరియో అనే మస్కట్‌ను రోజంతా విద్యార్థులకు స్నేహపూర్వకమైన గైడ్ గా ప్రదర్శించారు. ఐసీఎంఆర్ ప్రధాన కార్యక్రమాలను ప్రముఖంగా తెలిపే నాలుగు ప్రత్యేక లఘు చిత్రాలను కూడా విద్యార్థులకు చూపించారు. భారత్ స్వదేశీ వ్యాక్సిన్ అయిన కోవాక్సిన్ అభివృద్ధి, కొత్త ఆరోగ్య సేవల కోసం ఐడిఆర్ఓఎన్ కార్యక్రమం, టీబీ నిర్మూలనలో భారత్ చేస్తున్న ప్రయత్నాలు, భవిష్యత్ లో మహమ్మారుల సంసిద్ధతను అంచనా వేయడానికి నిర్వహించిన దేశవ్యాప్త మాక్ డ్రిల్ "విషాణు యుద్ధ్ అభ్యాస్" పై ఈ లఘు చిత్రాలను రూపొందించారు.

ముఖ్యంగా నేడు ఆగస్టు 8 వ తేదీ భారతీయ వైద్య శాస్త్రవేత్త, పాథాలజిస్ట్, మెడికల్ రైటర్, ఐసీఎంఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ వులిమిరి రామలింగస్వామి 104వ జయంతి కావడం ఈ సందర్భంలో ప్రాముఖ్యత సంతరించుకుంది. ఆయన వారసత్వం తరతరాల పరిశోధకులకు స్ఫూర్తినిస్తూనే ఉంది.

ఎస్.హెచ్.ఐ.ఎన్.ఇ చొరవ ద్వారా, యువ అభ్యాసకులలో సైన్స్ పట్ల ఆసక్తిని, ప్రజారోగ్యాన్ని మెరుగుపరచడంలో పరిశోధనల కీలక పాత్రపై అవగాహనను పెంపొందించడంలో ఐసీఎంఆర్ తన నిబద్ధతను పునరుద్ఘాటించింది.

# సంస్కృత భాషకు ప్రోత్సాహం... వారసత్వ పరిరక్షణపై నిబద్ధత పునరుద్ఘాటన

న్యూఢిల్లీ, ఆగష్టు 9:శ్రావణ పౌర్ణమినాడు ప్రపంచ సంస్కృత దినోత్సవ నిర్వహణ నేపథ్యంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. సంస్కృతం "కాలతీత జ్ఞాన, వ్యక్తీకరణలకు మూలం" అని పేర్కొంటూ, విభిన్న రంగాల్లో దాని శాశ్వత ప్రభావాన్ని ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు.

సంస్కృత బోధన, అభ్యాసం, ప్రాచుర్యం కల్పించడంలో ప్రపంచవ్యాప్తంగా కృషి చేస్తున్న పండితులు, విద్యార్థులు, ఔత్సాహికుల అంకితభావాన్ని ఈ సందర్భంగా శ్రీ మోదీ ప్రశంసించారు. సంస్కృత భాష బలోపేతం, అభ్యాసం, పరిశోధనల దిశగా గత దశాబ్ద కాలంలో ప్రభుత్వం అనేక చర్యలు తీసుకున్నదని ఆయన వివరించారు. ఇందులో భాగంగా కేంద్రీయ సంస్కృత విశ్వవిద్యాలయాల ఏర్పాటు, సంస్కృత అభ్యసన కేంద్రాల ప్రారంభం, సంస్కృత పండితులకు ఆర్థిక సహాయం, రాతప్రతుల డిజిటలీకరణ లక్ష్యంగా 'జ్ఞాన భారత్' అమలు వంటి అనేక కార్యక్రమాలు చేపట్టామని గుర్తుచేశారు.

దీనికి సంబంధించి సామాజిక మాధ్యమం 'ఎక్స్' ద్వారా పంపిన వరుస సందేశాల్లో:

"శ్రావణ పౌర్ణమి నేపథ్యంలో మనం ఈ రోజున ప్రపంచ సంస్కృత దినోత్సవం నిర్వహించుకుంటున్నాం. సంస్కృతం కాలాతీత జ్ఞాన, వ్యక్తీకరణలకు మూలం. ఈ భాష ప్రభావాన్ని అన్ని రంగాల్లో మనం చూడవచ్చు. ప్రపంచవ్యాప్తంగా సంస్కృతం నేర్చుకుంటున్న, ప్రాచుర్యం లోకి తెస్తున్న ప్రతి ఒక్కరినీ అభినందించడానికి ఇది తగిన సందర్భం."

"సంస్కృత భాషకు విశేష ప్రాచుర్యం కల్పించడంలో భాగంగా ప్రభుత్వం గత పదేళ్ల నుంచీ అనేక విధాలుగా కృషి చేసింది. ఈ మేరకు కేంద్రీయ సంస్కృత విశ్వవిద్యాలయాల ఏర్పాటు, సంస్కృత అభ్యసన కేంద్రాల ప్రారంభం, సంస్కృత పండితులకు ఆర్థిక సహాయం, రాతప్రతుల డిజిటలీకరణ లక్ష్యంగా 'జ్ఞాన భారత్' అమలు వంటి అనేక కార్యక్రమాలు చేపట్టాం. వీటిద్వారా అసంఖ్యాక విద్యార్థులు, పరిశోధకులకు ప్రయోజనం చేకూరింది'' అని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

# నేటికీ విద్య, వైద్యానికి దూరంగా ఆదివాసీలు : తోడసం నాగోరావ్



ఆదిలాబాద్, ఆగష్టు 9: ఆదివాసీలు ఇప్పటికీ విద్య, వైద్య సేవలకు దూరంగా ఉన్నట్లు ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ తోడసం నాగోరావ్ తెలిపారు.

అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవాన్ని శనివారం ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలంలో ఘనంగా నిర్వహించారు. ఆదివాసి పల్లెల్లో ఆదివాసి జెండాలను ఆవిష్కరించారు. ఆదివాసి హక్కులకి పోరాడిన మహనీయుల చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగోరావ్ మాట్లాడుతూ.. ఆదివాసి పల్లెలు నేటికి అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ మెస్రం రూప్ దేవ్, మూతి రామ్ పటేల్, ఏత్మారావ్, రూప్ దేవ్, భీం రావ్, నాగోరావు, ఆదివాసీ సంఘాల నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

# పట్టాలు తప్పిన గూడ్స్ రైలు.. వందే భారత్ సహా పలు రైళ్లు రద్దు..!



న్యూఢిల్లీ, ఆగష్టు 9:జార్ఖండ్‌లోని సెరైకేలా-ఖర్సవాన్ జిల్లాలోని చండిల్ సమీపంలో శనివారం తెల్లవారుజామున ఒక గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. గూడ్స్ రైలులోని 20కిపైగా బోగీలు పట్టాలు తప్పినట్లు సమాచారం. దాంతో ఆగ్నేయ రైల్వేలోని చండిల్-టాటానగర్ సెక్షన్ మధ్య రైలు సేవలు నిలిచిపోయాయి. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని ఒక అధికారి తెలిపారు. సమాచారం ప్రకారం, ఐరన్ లోడ్‌తో వెళ్తున్న గూడ్స్ రైలు టాటానగర్ నుంచి పురులియాకు వెళుతోంది. చండిల్ స్టేషన్ దాటిన తర్వాత గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. రైలు బోగీలు పక్కనే ఉన్న ట్రాక్‌పై వచ్చాయి.

ఎదురుగా వస్తున్న మరో గూడ్స్ రైలు కోచ్‌లను ఢీకొట్టాయి. మరొక గూడ్స్ రైలులోని అనేక కోచ్‌లు కూడా పట్టాలు తప్పాయి. ప్రమాదానికి కారణం రైల్వే దీనిపై దర్యాప్తు ప్రారంభించింది. సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ (ఆద్రా డివిజన్) వికాస్ కుమార్ మాట్లాడుతూ.. ప్రమాదం కారణంగా చండిల్ నుంచి అప్ డౌన్ ట్రాక్‌లో రైలు సేవలు ప్రభావితమయ్యాయని పేర్కొన్నారు. ప్రస్తుతం మరమ్మతు పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఎక్స్‌ప్రెస్, మెయిల్ రైళ్లన్నీ మళ్లించినట్లు పేర్కొన్నారు. చాలా వరకు రద్దు చేశామన్నారు. పాట్నా-టాటానగర్ (20894) వందే భారత్ ఎక్స్‌ప్రెస్, టాటానగర్-కతిహార్ (28181) ఎక్స్‌ప్రెస్, కతిహార్-టాటానగర్ ఎక్స్‌ప్రెస్‌లను (28182) రద్దు చేసినట్లు అధికారి తెలిపారు.

# కేంద్ర ప్రభుత్వ విధానాలపై బలమైన పోరాటాలు చేయాలి




హైదరాబాద్, ఆగష్టు 9: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక,రైతు,ప్రజా వ్యతిరేక విధానాలపై బలమైన పోరాటాలు చేయాలని పలువురు వక్తలు పిలుపు నిచ్చారు. శుక్ర వారం హిమా యత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో కేంద్ర,రాష్ట్ర కార్మిక ఉద్యోగ సంఘాల సంయుక్త సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్ రాజ్,రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ, సీఐటీయు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్వీ రమ, ఐఎఫ్‌టీయు నేతలు జి.అనురాధ, అరుణ,టీయుసిఐ నేతలు వి.ప్రవీణ్,కేఎస్.ప్రదీప్ మాట్లాడారు.

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ కార్మికుల హక్కులను హరించేందుకు ప్రయతిస్తోం దన్నారు. పెట్టుబడి దారులకు, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయే తప్ప ప్రజలకు మేలు చేసేందుకు కాదన్నారు. ఈ నెల 13న నారాయణగూడలో కేంద్ర ప్రభు త్వ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ల దిష్టి బొమ్మలను దహనం చేయాలని,సెప్టెంబర్ 22న నల్ల బ్యాడ్జీలు ధరించి ప్రజా ప్రతినిధులకు కార్మికులు,రైతుల సమస్యల పై వినతి పత్రాలు అందజేయాలని నిర్ణయిం చడం జరిగిందని వారు తెలిపారు. కార్మిక వర్గం ఉద్యమాలు చేసేందుకు సిద్ధం కావాలని వారు పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో పలు కార్మిక సంఘాల నేతలు ప్రవీణ్‌కుమార్,వంగూరు రాములు,ఎండీ.అంజాద్, వెంకట య్య,రాములు పాల్గొన్నారు.

# తెగిన తల, పలు చోట్ల శరీర భాగాలు.. మహిళ హత్యపై పోలీసులు దర్యాప్తు



బెంగళూరు, ఆగష్టు 9: ఒక మహిళను దారుణంగా హత్య చేశారు. తలతోపాటు శరీర భాగాలను ముక్కలుగా నరికారు. వాటిని పలు ప్రాంతాల్లో పడేశారు. చేతి భాగాన్ని కుక్క లాక్కెళుతుండగా స్థానికులు చూసి షాకయ్యారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు పది ప్రాంతాల్లో పడేసిన శరీర భాగాలను సేకరించారు. కర్ణాటకలోని తుమకూరు జిల్లాలో ఈ షాకింగ్ సంఘటన జరిగింది. ఆగస్ట్ 7న చింపుగనహళ్లిలోని ముత్యాలమ్మ ఆలయం సమీపంలో చెట్లపొదల నుంచి తెగిన చేతిని ఒక కుక్క రోడ్డుపైకి లాక్కొచ్చింది. ప్లాస్టిక్ కవర్‌లో చుట్టి ఉన్న మరో చేతిని కూడా స్థానికులు చూసి భయాందోళన చెందారు. పోలీసులకు సమాచారం ఇచ్చారు.

కాగా, లింగపుర రోడ్ వంతెన సమీపంలో పేగు భాగాలు, బెండోన్ నర్సరీ సమీపంలో కడుపు, ఇతర అంతర్గత అవయవాలు కనిపించాయి. జోనిగరహళ్లి సమీపంలో రక్తంతో తడిసిన బ్యాగ్‌తో పాటు ఒక కాలు, సిద్ధరబెట్ట, నెగలాల్ మధ్య రోడ్డులో రెండు బ్యాగుల్లో మరిన్ని శరీర భాగాలు పడి ఉన్నాయి.

మరోవైపు శుక్రవారం మధ్యాహ్నం సిద్ధరబెట్ట సమీపంలో మహిళ తల భాగం బయటపడింది. కొరటగెరె, కోలాల పోలీస్ స్టేషన్ల పరిధిలోని పది ప్రాంతాల్లో పడేసిన మహిళ శరీర భాగాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చేతులపై పచ్చబొట్లు, ముఖ ఆనవాళ్ల ద్వారా హతురాలిని 42 ఏళ్ల లక్ష్మీదేవమ్మగా గుర్తించారు.

కాగా, బెల్లావికి చెందిన ఆ మహిళ ఆగస్ట్ 3న తన కుమార్తెను చూడటానికి ఉర్డిగెరెకు వెళ్లింది. ఆ రాత్రి ఇంటికి తిరిగి రాకపోవడంతో భార్య అదృశ్యంపై భర్త బసవరాజు ఆగస్ట్ 4న బెల్లావి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో లక్ష్మీదేవమ్మను హత్య చేసి మృతదేహాన్ని ముక్కలుగా నరికి పలు ప్రాంతాల్లో పడేయడంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నిందితులను గుర్తించేందుకు ఆయా ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నారు.

# 'క్విట్ ఇండియా' ఉద్యమంలో పాల్గొన్న వారందరికీ ప్రధాని నివాళి

న్యూఢిల్లీ, ఆగష్టు 9:స్వాతంత్ర్య సమరంలో భాగంగా మహాత్మాగాంధీ స్ఫూర్తిదాయక నాయకత్వాన 'క్విట్ ఇండియా' ఉద్యమంలో పాల్గొన్న వారందరికీ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఇవాళ నిండు మనసుతో కృతజ్ఞతలు తెలిపి, నివాళి అర్పించారు.

పరాయి పాలనను ఎదిరించడంలో వారు ప్రదర్శించిన ధైర్య సాహసాలు దేశభక్తిని రగిలించగా, అశేష ప్రజానీకంలో పెల్లుబికిన స్వేచ్ఛా పిపాస అందర్నీ ఏకతాటిపైకి తెచ్చిందని శ్రీ మోదీ గుర్తుచేశారు.

ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్' ద్వారా పంపిన సందేశంలో:

"బాపూజీ స్ఫూర్తిదాయక నాయకత్వంలో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న వారందరినీ మనం నిండైన కృతజ్ఞతతో స్మరించుకుందాం. వారు ప్రదర్శించిన ధైర్యసాహసాలు దేశభక్తిని రగిలించగా, అశేష ప్రజానీకంలో పెల్లుబికిన స్వేచ్ఛా పిపాస అందర్నీ ఏకతాటిపైకి తెచ్చింది'' అని పేర్కొన్నారు.

# తిరుమలకు వెళ్తుండగా రోడ్డు ప్రమాదం.. ముగ్గురి మృతి

తిరుపతి, ఆగష్టు 9: తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మరణించారు. పల్నాడు జిల్లా పుడుగురాళ అమరావతి, ఆగష్టు 9కు చెందిన ఓ కుటుంబం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి దర్శనానికి మినీ వ్యాన్‌లోబయల్దేరారు. ఈ క్రమంలో ప్రకాశం జిల్లా చాకిచెర్ల వద్ద వారు ప్రయాణిస్తున్న వ్యాన్‌ను ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో అందులో ఉన్న ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందారు. మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు.

స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తున్నది. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# గుజారత్‌లో నేడు జరుపుకోనున్న 2025 ప్రపంచ సింహ దినోత్సవం



గుజరాత్ ప్రభుత్వ అటవీ మరియు పర్యావరణ శాఖ సహకారంతో పర్యావరణం, అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ, ఆగస్టు 10, 2025న గుజరాత్‌లోని దేవభూమి ద్వారక జిల్లాలోని బర్దా వన్యప్రాణుల అభయారణ్యంలో ప్రపంచ సింహ దినోత్సవం – 2025ను జరుపుకోనుంది.

ఈ వేడుకకు గుజరాత్ ముఖ్యమంత్రి శ్రీ భూపేంద్ర పటేల్, కేంద్ర పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రి శ్రీ భూపేందర్ యాదవ్, గుజరాత్ అటవీ మంత్రి శ్రీ ములుభాయ్ బేరా, పార్లమెంటు సభ్యులు, రాష్ట్ర శాసనసభ్యులు మరియు ఇతర ప్రజా ప్రతినిధులు హాజరవుతారు.

ఆగస్టు 10న జరుపుకునే ప్రపంచ సింహ దినోత్సవం, ప్రపంచవ్యాప్తంగా సింహాల సంరక్షణ మరియు రక్షణ గురించి అవగాహన పెంచడం లక్ష్యంగా పెట్టుకుంది. గుజరాత్‌లో, ఆసియాటిక్ సింహం ఒక ప్రత్యేకమైన పర్యావరణ మరియు సాంస్కృతిక సంపద, ఇది సౌరాష్ట్ర ప్రాంతంలో మాత్రమే కనిపిస్తుంది. ప్రాజెక్ట్ లయన్ కింద మంత్రిత్వ శాఖ మరియు రాష్ట్రం యొక్క స్థిరమైన ప్రయత్నాలు మరియు గుజరాత్ ప్రభుత్వ నాయకత్వం ఈ ఐకానిక్ జాతి మనుగడ మరియు పెరుగుదలను నిర్ధారించడంలో గణనీయమైన పురోగతిని సాధించాయి.

'అడవి రాజు' – ఆసియాటిక్ సింహం పరిరక్షణ మరియు రక్షణ గురించి అవగాహనను ప్రోత్సహించడానికి గుజరాత్‌లోని సౌరాష్ట్రలోని 11 జిల్లాల్లో ఆగస్టు 10న 'ప్రపంచ సింహ దినోత్సవం' యొక్క గొప్ప వేడుకలు నిర్వహించబడతాయి. ఈ గంభీరమైన జంతువులు సౌరాష్ట్రలోని 11 జిల్లాల్లో సుమారు 35,000 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో వాటి సహజ ఆవాసాలలో స్వేచ్ఛగా తిరుగుతాయి. 2020 నుండి గుజరాత్‌లో సింహాల జనాభా 32% పెరిగింది, మే 2025 సింహాల జనాభా అంచనా ప్రకారం 2020లో 674 నుండి 891కి పెరిగింది.

బర్దా వన్యప్రాణుల అభయారణ్యం పోర్బందర్ మరియు దేవభూమి ద్వారక జిల్లాల్లో 192.31 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉంది. బర్దా ఆసియా సింహాలకు రెండవ నివాసంగా అభివృద్ధి చెందుతోంది. 2023లో ఈ ప్రాంతానికి సింహాలు సహజంగా వలస వచ్చిన తర్వాత, సింహాల జనాభా 17కి పెరిగింది, వీటిలో 6 పెద్ద సింహాలు మరియు 11 పిల్లలు ఉన్నాయి. ఈ అభయారణ్యం ఒక ముఖ్యమైన జీవవైవిధ్య హాట్‌స్పాట్ మరియు ఆసియా సింహాల సంరక్షణకు కీలకమైన ప్రాంతం. ద్వారక-పోర్బందర్-సోమనాథ్ టూరిస్ట్ సర్క్యూట్ సమీపంలో ఉండటంతో, బర్దా ప్రాంతం గణనీయమైన పర్యాటక సామర్థ్యాన్ని కలిగి ఉంది. దాదాపు 248 హెక్టార్ల ప్రాంతంలో సఫారీ పార్క్‌ను ప్రారంభించాలని ప్రణాళిక చేయబడింది, దీని కోసం రాష్ట్ర ప్రభుత్వం భూమిని కేటాయించింది. ఈ కార్యక్రమంలో దాదాపు రూ. 180.00 కోట్ల విలువైన వన్యప్రాణుల సంరక్షణ పనులు కూడా ప్రారంభించబడతాయి.

గ్రేటర్ గిర్ లయన్ ల్యాండ్‌స్కేప్‌లోని 11 జిల్లాలలోని పాఠశాలలు మరియు కళాశాలల నుండి లక్షలాది మంది విద్యార్థులు ఉపగ్రహ కమ్యూనికేషన్ ద్వారా కూడా ఈ కార్యక్రమంలో చేరతారు. 2024లో, ప్రపంచ సింహ దినోత్సవం నాడు జరిగిన కార్యక్రమంలో 18.63 లక్షల మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# ఊర్లకు వెళ్తున్న నగరవాసులు.. ఎన్‌హెచ్ 65పై నెమ్మదిగా కదులుతున్న వాహనాలు

హైదరాబాద్, ఆగష్టు 9: హైదరాబాద్-విజయవాడ రహదారిపై ట్రాఫిక్ రద్దీ నెలకొన్నది. రాఖీ పండుగ, వీకెండ్ కావడంతో హైదరాబాద్ (ఊఎటవతీజీఎజీట) నగరవాసులు ఊళ్లకు వెళ్తున్నారు. దీంతో 65వ జాతీయ రహదారిపై వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. ఎల్బీనగర్, వనస్థలిపురం, హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ వద్ద ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఊర్లకు వెళ్లేందుకు బస్టాప్‌ల వద్ద ప్రజలు బస్సుల కోసం పెద్ద సంఖ్యలో వేచి ఉన్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లో వాహనాలు నెమ్మదిగా వెళ్తున్నాయి. ఇక చౌటుప్పల్, పంతంగి టోల్‌ప్లాజా వద్ద వాహనాల రద్దీ నెలకొంది.

కాగా, రాఖీ పండుగ నేపథ్యంలో ఆర్టీసీ బస్టాండ్లలో ప్రయాణికుల రద్దీ నెకొంది. హైరదాబాద్‌లోని ప్రధాని బస్టాండ్లలో రద్దీ పెరిగింది. ఎంజీబీఎస్, సికింద్రాబాద్ జేబీఎస్, ఉప్పల్, ఎల్బీనగర్‌లో బస్సుల కోసం ప్రయాణికులు నిరీక్షిస్తున్నారు. రద్దీకి అనుగుణంగా రాఖీ స్పెషల్ పేరుతో ఆర్టీసీ బస్సు సర్వీసులను నడుపుతున్నది. ఎక్స్‌ప్రెస్ బస్సులు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి.

# మొక్కలను తోబుట్టువులుగా భావించాలి - మున్సిపల్ కమిషనర్ రమాదేవి

నల్గొండ, ఆగషు 9:మొక్కలను తోబుట్టువులుగా భావించి ప్రతి ఒక్కరూ చెట్లను నాటి వాటిని సంరక్షించాలని కోదాడ మున్సిపల్ కమిషనర్ రమాదేవి అన్నారు. రాఖీ పండుగ సందర్భంగా శనివారం విజయీభవ ట్రస్ట్ ఆధ్వర్యంలో పట్టణంలోని గాంధీ పార్క్ ఆవరణలో వృక్ష బంధన్ కార్యక్రమంలో భాగంగా మొక్కలకు రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రకృతిలోని చరాచర జీవులు సుభిక్షంగా ఉండాలంటే మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. విజయీభవ ట్రస్ట్ చేస్తున్న సామాజిక సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు చారుగాండ్ల ప్రవీణ రాజశేఖర్, ఓరుగంటి ప్రభాకర్, వెంపటి వెంకటరమణ, పత్తి నరేందర్, వెంపటి ప్రసాద్, గుడుగుంట్ల సాయి పాల్గొన్నారు.

# నిరంతర విద్యుత్ సరఫరా అందేలా చూడాలి : కలెక్టర్ రాహుల్ రాజ్



మెదక్, ఆగష్టు 9:విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. ఆయన శనివారం సాయంత్రం పావన్నపేట మండల పరిధిలోని మిన్పూర్ సబ్ స్టేషన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిరంతర విద్యుత్ సరఫరా అందేలా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా విద్యుత్ సరఫరా, నిర్వహణ ఏర్పాట్ల గురించి ఆరా తీశారు.

విద్యుత్ సరఫరాకు సంబంధించిన పరికరాలు, నిర్వహణ ఏర్పాట్లు, భద్రతా చర్యలు మొదలైన వాటిని పరిశీలించారు. అంతేకాకుండా సబ్ స్టేషన్ లోని సాంకేతిక పరికరాల పనితీరును పరిశీలించి, అవసరమైన సూచనలు చేశారు. సబ్ స్టేషన్ లోని సాంకేతిక సిబ్బందికి కొన్ని సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంబంధిత విద్యుత్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జన్నారంలో ఉద్రిక్తత..

## 35 మంది ఆదివాసీలపై కేసు

ఆదిలాబాద్, ఆగష్టు 9: మంచిర్యాల జిల్లా జన్నారం అటవీ డివిజన్ పరిధిలోని కవ్వాల్ టైగర్ రిజర్వ్‌లో ఉద్రిక్తత నెలకొంది. కవ్వాల్ సెక్షన్‌లోని పాలగోరి ప్రాంతంలో కొంతమంది ఆదివాసీలు అక్రమంగా అడవిలోకి చొరబడి భూమిని ఆక్రమించి గుడిసెలు వేసుకున్నారని సమాచారం అందింది.

దీంతో ఎఫ్డీఓ రామ్మోహన్ ఆదేశాల మేరకు, ఇందనపల్లి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ గడిపల్లి శ్రీధరచారి ఆధ్వర్యంలో అటవీ అధికారులు, పోలీసులు అక్కడికి చేరుకున్నారు. అయితే, వారి రాకను అడ్డుకునేందుకు కొంతమంది ఆదివాసీలు కారంపొడి చల్లి, కర్రలతో దాడి చేశారు.

ఈ ఘటనలో జన్నారం రేంజ్‌కు చెందిన దొంగపల్లి ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ రాజేందర్, బీట్ ఆఫీసర్ జె. సంతోష్ గాయపడ్డారు. రేంజ్ ఆఫీసర్ ఫిర్యాదు మేరకు, కొమురం భీం–ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (యు) మండలం నేతునూరు గ్రామానికి చెందిన సీడం మోతీరాం నాయకత్వంలో 35 మంది ఈ దాడిలో పాల్పడినట్లు గుర్తించారు.

ఇంధన్ పల్లి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీధర్ చారి లిఖితపూర్వక ఫిర్యాదు ఆధారంగా, జన్నారం పోలీసులు సీడం మోతీరాం సహా 35 మందిపై 163/2025 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# సింగపూర్‌లోని చాంగి నావల్ బేస్‌లో ఐఎన్ఎస్ సంధాయక్

న్యూఢిల్లీ, ఆగష్టు 9:అత్యాధునిక హైడ్రోగ్రఫీ సామర్థ్యం కలిగిన మొట్టమొదటి స్వదేశీ సర్వే వెసెల్ లార్జ్ (సాఎల) ఇండియన్ నావల్ షిప్ సంధాయక్, జాతీయ దినోత్సవం సందర్భంగా – 09 ఆగస్టు 25న మూడు రోజుల పర్యటన కోసం సింగపూర్‌లోకి ప్రవేశించింది. ఈ సందర్శన ప్రాంతీయ సముద్ర సహకారానికి భారతదేశం యొక్క నిబద్ధతను పునరుద్ఘాటిస్తుంది మరియు భారత నావికాదళం మరియు సింగపూర్ సముద్ర సంస్థల మధ్య ద్వైపాక్షిక హైడ్రోగ్రాఫిక్ సంబంధాలను బలోపేతం చేయడంలో ఒక ముఖ్యమైన అడుగును సూచిస్తుంది.

భారత నావికాదళం యొక్క హైడ్రోగ్రాఫిక్ డిపార్ట్‌మెంట్ ఫ్రేమ్‌వర్క్ కింద సముద్ర దౌత్యం మరియు ప్రాంతీయ హైడ్రోగ్రాఫిక్ సామర్థ్య నిర్మాణంలో భారతదేశం యొక్క పెరుగుతున్న నాయకత్వాన్ని కూడా ఈ సందర్శన ప్రదర్శిస్తుంది.

గౌరవనీయులైన రక్షా మంత్రి సమక్షంలో ఏఔ సంధాయక్ ఫిబ్రవరి 2024లో కమిషన్ చేయబడింది. ఈ నౌక పూర్తి స్థాయి తీరప్రాంత మరియు లోతైన నీటి సర్వే సామర్థ్యాన్ని కలిగి ఉంది మరియు ఆన్‌బోర్డ్ హెలికాప్టర్ మరియు ఆసుపత్రి విధులతో సాంఖీ/మానవతా కార్యకలాపాలను నిర్వహించగలదు.

ఈ నౌక సింగపూర్ కు తొలి పర్యటన సాంకేతిక/వృత్తిపరమైన మార్పిడులు మరియు స్థిరమైన హైడ్రోగ్రాఫిక్ మద్దతు నిశ్చితార్థాలను సులభతరం చేయడం లక్ష్యంగా పెట్టుకుంది.

# ప్రభావవంతమైన పన్ను ఆదా సాధనాల్లో ఈఎల్ఎస్ఎస్ : జీవన్ కుమార్

హైదరాబాద్, ఆగష్టు 9:భారత దేశంలో రిటైల్ పెట్టుబడిదారులకు అందుబాటులో ఉన్న అత్యంత ప్రజాదరణ పొందిన, ప్రభావవంతమైన పన్ను ఆదా సాధనాల్లో ఒకటిగా ఈక్విటీ-లింక్డ్ సేవింగ్స్ స్కీమ్‌లు నిలుస్తున్నాయని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజరీ హెడ్ జీవన్ కుమార్ అన్నారు. ఇవి ఈక్విటీ ఎక్స్‌పోజర్ ద్వారా పన్ను ప్రయోజనాలు, దీర్ఘకాలిక మూలధన పెరుగుదల ప్రత్యేకమైన కలయికను అందిస్తాయి, పన్ను ప్రణాళికను సంపద సృష్టితో సమతుల్యం చేయడానికి చక్కటి ఎంపికగా చేస్తాయన్నారు.

ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 80సి ప్రకారం , ఆర్థిక సంవత్సరంలో ఈఎల్ఎస్ఎస్ నిధుల్లో పెట్టిన పెట్టుబడులు రూ. 1.5లక్షల వరకు పన్ను మినహాయింపులకు అర్హత సాధిస్తాయన్నారు. అత్యధిక ఆదాయ పన్ను స్లాబ్ 30%లో ఉన్న పెట్టుబడిదారులకు, రూ. 46,800వరకు ఆదాకు తోడ్పడవచ్చు. అయితే, ఈ ప్రయోజనాలు పాత పన్ను విధానంలో మాత్రమే అందుబాటులో ఉన్నాయని గమనించడం ముఖ్యమన్నారు.

అయినప్పటికీ, ఈఎల్ఎస్ఎస్ పథకాలు వాటి ఈక్విటీ-లింక్డ్ రిటర్న్‌లు, తక్కువ లాక్-ఇన్ పీరియడ్‌ల కారణంగా పెట్టుబడిదారులను ఆకర్షిస్తూనే ఉన్నాయి. పెట్టుబడి పెట్టటానికి ముందు, ఈఎల్ఎస్ఎస్ నిధుల లాక్-ఇన్ మెకానిజం ను అర్థం చేసుకోవడం చాలా ముఖ్యమన్నారు. ఏకమొత్తం పెట్టుబడులకు, మూడు సంవత్సరాల లాక్-ఇన్ లావాదేవీ తేదీ నుండి ప్రారంభమవు తుందన్నారు. అయితే, సిప్ ద్వారా పెట్టుబడి పెట్టేటప్పుడు, ప్రతి వాయిదాను ప్రత్యేక పెట్టుబడిగా పరిగణిస్తారన్నారు. ఫస్ట్-ఇన్-ఫస్ట్-అవుట్ (ఫిఫో) నియమాన్ని అనుసరించి దాని స్వంత మూడు సంవత్సరాల లాక్-ఇన్ వ్యవధిని కలిగి ఉంటుందన్నారు.

ఈఎల్ఎస్ఎస్ నిధులు ప్రధానంగా ఈక్విటీలలో పెట్టుబడి పెడతాయి కాబట్టి, రాబడికి హామీ లేదు. ఈఎల్ఎస్ఎస్ నిధులు పెట్టుబడిదారులకు వృద్ధి, డివిడెండ్ చెల్లింపు పద్ధతుల మధ్య ఎంచుకునే అవకాశాన్ని అందిస్తాయన్నారు. మీడియం నుండి హై-రిస్క్ చేయగల వ్యక్తులకు, ఈఎల్ఎస్ఎస్ ఈక్విటీ మార్కెట్ల లో పెట్టుబడి పెట్టడానికి ఒక అద్భుతమైన ప్రవేశ బిందువుగా పనిచేస్తుందన్నారు.

ఈఎల్ఎస్ఎస్ నిధుల్లో పెట్టుబడి పెట్టే ముందు పెట్టుబడిదారులు తమ ఆర్థిక లక్ష్యాలు, పెట్టుబడి హారిజోన్ (ఎనిలవబఎవనిబ ఊనీతీతిళినీని), రిస్క్ టాలరెన్స్‌ను అంచనా వేయాలన్నారు. ఎల్ జిసిజి పన్నులో ఇటీవలి మార్పులు, ప్రత్యామ్నాయ సాధనాల ఆవిర్భావం ద్వారా పెట్టుబడిదారుల ప్రాధాన్యతలు ప్రభావితమైనప్పటికీ, ఈఎల్ఎస్ఎస్ దీర్ఘకాలికంగా సంపద సృష్టి సామర్థ్యం, సాపేక్షంగా తక్కువ లాక్-ఇన్ వ్యవధి, సిప్ -ఆధారిత పెట్టుబడికి అనుకూలత కోసం ప్రత్యేకంగా నిలుస్తుందన్నారు.

# గిరిజనుల జీవితాల్లో వెలుగులు..



అమరావతి, ఆగష్టు 9:సుసంపన్న, ఆరోగ్య, ఆనంద ఆంధ్ర సాకారానికి గిరిజనుల సమగ్రాభివృద్ధి కూడా కీలకమని.. ఆదివాసీల సాధికారతకు ప్రత్యేక పథకాలు, కార్యక్రమాలతో ప్రభుత్వం కృషిచేస్తోందని, వీటిని సద్వినియోగం చేసుకొని అన్ని విధాలా ఉన్నతంగా ఎదగాలని శాసనసభ్యుడు కొలికపూడి శ్రీనివాస రావు , జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు.

జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శాసనసభ్యుడు కొలికపూడి శ్రీనివాసరావు అధ్యక్షతన శనివారం ఎ.కొండూరులోని గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు జరిగాయి. తొలుత ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, కలెక్టర్ లక్ష్మీశ అధికారులు, గిరిజన నాయకులతో కలిసి మహనీయులు సేవాలాల్ మహరాజ్, ఏకలవ్యుడు, డా.బీఆర్ అంబేద్కర్, వెన్నెలగంటి రాఘవయ్య, అల్లూరి సీతారామరాజు, చెంచులక్ష్మి తదితరులకు ఘన నివాళు లర్పించారు. వేడుకల్లో గిరిజన సంప్రదాయ కళా ప్రదర్శనలు అలరించాయి.

ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ 50శాతానికి పైగా గిరిజన జనాభా ఉన్న ప్రాంతాల్లో ఐటీడీఏల ద్వారా విశేష కృషి జరుగుతోందని.. ఎస్టీ సబ్ ప్లాన్ అమలుతో పాటు వివిధ సంక్షేమ పథకాలు, కార్యక్రమాల అమల్లోనూ ప్రత్యేక అధికార యంత్రాంగం పనిచేస్తోందన్నారు. మౌలిక వసతుల అభివృద్ధిపైనా ప్రత్యేకంగా దృష్టిసారించడం జరుగుతోందన్నారు. గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఆశ్రమ పాఠశాలలు ఏర్పాటు చేయడం జరిగిందని.. వీటిలో చదువుకొని ఎందరో గొప్పవారయ్యారన్నారు. స్వర్ణాంధ్ర ఏ 2047లో భాగంగా ఎమ్మెల్యే నేతృత్వంలో నియోజకవర్గాల దార్శనిక ప్రణాళికలు రూపొందించడం జరిగిందని, గిరిజనుల తలసరి ఆదాయాన్ని పెంచేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు.

**గిరిజనులు ఆకాశమే హద్దుగా ఎదగాలి..**

గిరిజనుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని విద్యార్థులు చదువుకునేందుకు గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేయడం జరిగిందని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తెలిపారు. ఆదివాసీలు తమ పిల్లలను బాగా చదివించుకొని, వెనుకబాటుతనం నుండి బయటపడి నాగరిక సమాజంతో పోటీపడి ఆకాశమే హద్దుగా ఎదగాలని విజ్ఞప్తి చేశారు. ఆదివాసీ యువత, విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, అదేవిధంగా తండాల పెద్దలు తమ పిల్లల చదువులపై దృష్టిపెట్టి మంచి దారిలో నడిపించాలన్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇటీవల కానిస్టేబుల్ ఉద్యోగాల లో తిరువూరు నియోజవర్గం నుండి 37 మంది ఎంపికయ్యారని వారిలో గిరిజన యువకులు ఉన్నారన్నారు. ఈనెల 22న తిరువూరులో మెగాజాబ్ మేళా నిర్వహిస్తున్నామని, 500 మందికి పైగా యువతకు ఉద్యోగాలు కల్పించే జాబ్ మేళాను పదోతరగతి నుండి ఇంటర్, డిగ్రీ వరకు నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వేడుకల్లో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి ఎ.విజయశాంతి, తిరువూరు ఆర్‌డీవో కె.మాధురి, మాదిక కార్పొరేషన్ డైరెక్టర్ వాసం మునియ్య, విద్యావేత్త బి.జ్యోతిలాల్ నాయక్, జెడ్‌పీటీసీ భుక్యా గన్యా, స్థానిక గిరిజన నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు సాగు నీరందించడమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే వేముల వీరేశం



నల్గొండ, ఆగషు 9: రైతులకు సాగు నీరందించడమే ప్రభుత్వ ధ్యేయమని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. శనివారం మండలంలోని అయిటిపాముల రిజర్వాయర్ డీ49 నుండి నకిరేకల్, కేతేపల్లి మండలాల్లోని చెరువులను నింపేందుకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నకిరేకల్, కేతేపల్లి, కట్టంగూర్ మండలాల్లోని వ్యవసాయరంగానికి నీరందించేందుకు రిజర్వాయర్ నుండి 200 క్యూ సెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ రంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, అందులో భాగంగా లిఫ్ట్ పనులు వేగవంతంగా జరుగుతున్నట్లు చెప్పారు.

రైతులు అధికారులకు సహకరించి సాగునీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని సూచించారు. అనంతరం ఈదులూరులో కంఠమహేశ్వరస్వామి పండుగలో పాల్గొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నకిరేకల్ మార్కెట్ కమిటీ చైర్మన్ గుత్త మంజుల మాధవరెడ్డి, నీటిపారుదల ఇరిగేషన్ డీఈ భూషణాచారి, ఏఈలు పాండు, చందన, మాజీ జడ్పీటీసీలు మాద యాదగిరి, సుంకరబోయిన నర్సింహ్మా, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పెద్ది సుక్కయ్య, మాజీ సర్పంచ్ బెజవాడ సైదులు, చౌగోని సాయిలు, అయితగోని నారాయణ, గాదగోని కొండయ్య, ఎడ్ల పెదరాములు. నంద్యాల వెంకట్ రెడ్డి, చౌగోని రవి, మర్రి రాజు, ముక్కాముల శేఖర్ పాల్గొన్నారు.

# నిజామాబాద్‌లో ఘనంగా ఆదివాసి దినోత్సవం



నిజామాబాద్, ఆగష్టు 9:నిజామాబాద్ పట్టణంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా నగరం లోని ఆదివాసీ నాయకపోడ్ తెగకు చెందిన వారు ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ పట్టణం లోని వినాయకనగర్ యందు ఉన్నటువంటి ఆదివాసీల పోరాటయోధుడు స్ఫూర్తి ప్రదాత అయినటువంటి కొమరం భీం విగ్రహానికి ఘనంగా నివాళులర్పించి జెండా ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ దాదన్నగారివిట్టల్ రావు, ఃఖీఎ నాయకులు, బాజిరెడ్డి జగన్, జిల్లా డీటీడబ్ల్యువో అధికారి నాగోరావు, జిల్లా ఆదివాసీ నాయకపోడు సేవా సంఘం అధ్యక్షుడు గాండ్ల రామచందర్, గౌరవ అధ్యక్షుడు బండారి భోజన్న, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో సాయన్న, ధాత్రి అంజయ్య, శానం పవన్ కుమార్, జిల్లా అధికారి ప్రతినిధి పుట్ట దుర్గ మల్లేష్, కొండ శ్రీనివాస్, అశోక్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రారంభించిన దాదాపు 6 నెలల్లోనే సంచార్ సాథీ మొబైల్ యాప్ డౌన్‌లోడ్‌లు 50 లక్షలను దాటాయి

న్యూఢిల్లీ, ఆగష్టు 9: టెలికమ్యూనికేషన్స్ శాఖ చేపట్టిన సంచార్ సాథీ చొరవ టెలికాం భద్రతను పెంపొందించడంలో మరియు పౌరులకు సాధికారత కల్పించడంలో గణనీయమైన ప్రభావాన్ని చూపింది. ప్రారంభించినప్పటి నుండి, మొబైల్ యాప్ ఆరు నెలల్లోనే 50 లక్షల డౌన్‌లోడ్‌లను దాటింది. భారతదేశంలోని విస్తృత భాషా మరియు ప్రాంతీయ వైవిధ్యాన్ని గుర్తించి, ఆనీ ఇంగ్లీష్, హిందీ మరియు 21 ప్రాంతీయ భాషలకు మద్దతు ఇవ్వడం ద్వారా యాప్ యొక్క యాక్సెసిబిలిటీని విస్తరించింది. మోసపూరిత కాల్‌లు మరియు సందేశాలను నివేదించడం మరింత సజావుగా చేయబడింది, వినియోగదారులు ఇప్పుడు వారి కాల్ మరియు సాటా లాగ్‌ల నుండి నేరుగా కొన్ని ట్యాప్‌లలో నివేదికలను దాఖలు చేయగలరు.

ప్రారంభించినప్పటి నుండి, సంచార్ సాథీ చొరవ 5.35 లక్షలకు పైగా పోగొట్టుకున్న లేదా దొంగిలించబడిన మొబైల్ హ్యాండ్‌సెట్‌లను తిరిగి పొందేందుకు, పౌరుల నివేదికల ఆధారంగా 1 కోటి కంటే ఎక్కువ అనధికార మొబైల్ కనెక్షన్‌లను డిస్‌కనెక్ట్ చేయడానికి మరియు చక్షు ఫీచర్ ద్వారా ఫ్లాగ్ చేయబడిన 29 లక్షలకు పైగా మొబైల్ నంబర్‌లను నిష్క్రియం చేయడానికి దారితీసింది. సంచార్ సాథీ పోర్టల్ 16.7 కోట్లకు పైగా సందర్శనలను చూసింది, ఇది ఈ పౌర-కేంద్రీకృత డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై పెరుగుతున్న ప్రజల నమ్మకాన్ని ప్రతిబింబిస్తుంది.

ఆర్థిక మోసం రిస్క్‌తో మొబైల్ నంబర్‌ల అనుబంధం ఆధారంగా వాటిని అంచనా వేసి వర్గీకరించే ఆర్థిక మోసం రిస్క్ ఇండికేటర్ (ఈఖీఎ)ని కూడా ఆనీ అమలు చేసింది. ఈ సాధనం బ్యాంకులు, ఎన్‌బిఎఫ్‌సిలు మరియు యుపిఐ సర్వీస్ ప్రొవైడర్లు వినియోగదారులను రక్షించడానికి చురుకైన చర్యలు తీసుకోవడానికి వీలు కల్పిస్తుంది. ఫలితంగా, 34 ఆర్థిక సంస్థలు 10.02 లక్షల బ్యాంక్ ఖాతాలు/చెల్లింపు వాలెట్‌లను స్తంభింపజేశాయి మరియు ఎఫ్ఆర్ఐ రేటింగ్‌ల ఆధారంగా 3.05 లక్షల ఖాతాలపై డెబిట్/క్రెడిట్ పరిమితులను విధించాయి.

# సెలవుల్లో కుటుంబంతో కలిసి 5 వారాల పని నుండి విరామం పొందాలనుకునే వారికి శుభవార్త

న్యూఢిల్లీ, ఆగష్టు 9:రద్దీని నివారించడానికి, ఇబ్బంది లేని బుకింగ్‌ను నిర్ధారించడానికి అలాగే ప్రయాణీకులను సులభతరం చేయడానికి మరియు పండుగ సీజన్లలో ఎక్కువ దూరం వరకు గరిష్ట ట్రాఫిక్‌ను పునఃపంపిణీ చేయడానికి మరియు ప్రత్యేక రైళ్లతో సహా రెండు వైపులా ఉపయోగించుకునేలా చూసుకోవడానికి, రాయితీ ఛార్జీలపై పండుగ రద్దీ కోసం రౌండ్ ట్రిప్ ప్యాకేజీ అనే ప్రయోగాత్మక పథకాన్ని రూపొందించాలని నిర్ణయించారు. క్రింద వివరించిన విధంగా నిర్ణీత కాలంలో తిరుగు ప్రయాణాన్ని ఎంచుకునే ప్రయాణీకులకు ఈ పథకం వర్తిస్తుంది:

ఈ పథకం కింద, ఒకే ప్రయాణీకుల సమూహానికి ముందుకు మరియు తిరుగు ప్రయాణానికి బుక్ చేసుకున్నప్పుడు రాయితీలు వర్తిస్తాయి. తిరుగు ప్రయాణం యొక్క ప్రయాణీకుల వివరాలు తదుపరి ప్రయాణానికి సమానంగా ఉంటాయి.

తేదీ 13 అక్టోబర్ 2025 కి బుకింగ్ ప్రారంభ తేదీ 14.08.2025. రైలు ప్రారంభ తేదీకి ముందుగా 13 అక్టోబర్ 2025 మరియు 26 అక్టోబర్ 2025 మధ్య టికెట్ బుక్ చేసుకోవాలి మరియు ఆ తర్వాత నవంబర్ 17 మరియు డిసెంబర్ 1, 2025 మధ్య రైలు ప్రారంభ తేదీకి కనెక్టింగ్ జర్నీ ఫీచర్ ఉపయోగించి తిరుగు ప్రయాణ టికెట్ బుక్ చేసుకోవాలి. తిరుగు ప్రయాణ బుకింగ్‌కు ముందస్తు రిజర్వేషన్ వ్యవధి వర్తించదు.

పైన పేర్కొన్న బుకింగ్ రెండు దిశలలో ధృవీకరించబడిన టిక్కెట్లకు మాత్రమే అనుమతించబడుతుంది.

తిరుగు ప్రయాణానికి సంబంధించిన బేస్ ఫేర్‌పై మాత్రమే 20% మొత్తం రాయితీలు మంజూరు చేయబడతాయి.

ఈ పథకం కింద బుకింగ్ ఒకే తరగతి మరియు ఒకే సా-ఆ జత కోసం ముందుకు మరియు తిరుగు ప్రయాణం రెండింటికీ ఉంటుంది.

ఈ పథకం కింద బుక్ చేసుకున్న టిక్కెట్లకు ఛార్జీల వాపసు అనుమతించబడదు.

ఫ్లెక్సీ ఫేర్ ఉన్న రైళ్లు తప్ప, ప్రత్యేక రైళ్లు (డిమాండ్‌పై రైళ్లు) సహా అన్ని తరగతులకు మరియు అన్ని రైళ్లలో పైన పేర్కొన్న పథకం అనుమతించబడుతుంది.

ఈ టికెట్లలో ఏ ప్రయాణంలోనూ ఎటువంటి మార్పులు అనుమతించబడవు.

రాయితీ ఛార్జీపై తిరుగు ప్రయాణ బుకింగ్ సమయంలో డిస్కౌంట్లు, రైలు ప్రయాణ కూపన్లు, వోచర్ ఆధారిత బుకింగ్‌లు, పాస్‌లు లేదా ఖూలు మొదలైనవి అనుమతించబడవు.

# రక్షా బంధన్ కోసం ఇంటికి వెళ్లేందుకు సిద్ధమైన నర్సు.. హాస్పిటల్‌లో అనుమానాస్పదంగా మృతి

భువనేశ్వర్, ఆగష్టు 9: రక్షా బంధన్ జరుపుకునేందుకు డ్యూటీ తర్వాత ఇంటికి వెళ్లేందుకు నర్సు సిద్ధమైంది. అయితే హాస్పిటల్‌లోని బాత్‌రూమ్‌లో అనుమానాస్పదంగా మరణించింది. ఈ నేపథ్యంలో పలు కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో ఈ సంఘటన జరిగింది. ప్రైవేట్ హాస్పిటల్‌లో నర్సుగా ఒక మహిళ పని చేస్తున్నది. శనివారం రాఖీ జరుపుకునేందుకు డ్యూటీ తర్వాత గంజాం జిల్లాలో ఇంటికి వెళ్లేందుకు సిద్ధమైంది. అయితే హాస్పిటల్‌లోని బాత్‌రూమ్‌లో అనుమానాస్పదంగా మరణించింది.కాగా, రెండు గంటలు ఆలస్యంగా హాస్పిటల్ యాజమాన్యం తమకు సమాచారం ఇచ్చినట్లు నర్సు సోదరుడు ఆరోపించాడు. తొలుత బాత్‌రూమ్‌లో అపస్మారక స్థితిలో పడి ఉన్నట్లు తమకు తెలిపారని, ఆ తర్వాత ఆమె చేతిలో సిరంజి ఉన్నదని, ఆత్మహత్యకు పాల్పడినట్లు చెప్పారన్నాడు. ఈ నేపథ్యంలో సోదరి మరణంలో ఆసుపత్రి పాత్ర ఉన్నట్లు సోదరుడు అనుమానం వ్యక్తం చేశాడు.

మరోవైపు ఆ హాస్పిటల్‌కు చేరుకున్న పోలీసులు నర్సు మృతదేహాన్ని పరిశీలించారు. ఆమె చేతిలో సిరంజి, చేతి వెనుక భాగంలో సూది ఉన్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో సూది ద్వారా ఇంజెక్ట్ చేసుకుని చనిపోయినట్లు అనుమానిస్తున్నారు. దీంతో ఆత్మహత్య, ప్రమాదవశాత్తు మరణం, ఆరోగ్య సమస్యలు, రిలేషన్‌షిప్, పని ప్రదేశంలో వేధింపులు, కుటుంబ సమస్యలు వంటి పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు. ఆసుపత్రిలోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నామని, సిబ్బందిని ప్రశ్నిస్తున్నామని వెల్లడించారు.

# కాంగ్రెస్ కార్యకర్తల ఆర్థిక సహాయం



మహబూబాబాద్ పెద్దవంగర మండలంలోని చిట్యాల గ్రామంలో గత కొద్ది రోజుల క్రితం గుండెపోటుతో గుంటుక మురళి (36) కాంగ్రెస్ యువ నాయకులు మరణించడం జరిగింది. చిట్యాల గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పాక శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్యకర్తలు అంతా కలిసి తొమ్మిది వేల రూపాయలు వారి కుటుంబానికి ఆర్థిక సహాయం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల యూత్ ఉపాధ్యక్షుడు ఆవుల మహేష్, గ్రామ యూత్ అధ్యక్షుడు మొగలగాని రజనీకాంత్,నాయకులు మొగులగాని సొమ్మల్లు,ఆకుతోట వెంకన్న, గజ్జి వెంకన్న,నారబోయిన రమేష్,మందపురి హరీష్, ఆవుల వెంకన్న ,అన్నపురం సోమయ్య, కందుల దేవేందర్,సోషల్ మీడియా ఇంచార్జీ రాము తదితరులు పాల్గొన్నారు.

# ఆర్మీ హాస్పిటల్ రీసెర్చ్ & రెఫరల్‌లో వయోజన వ్యాక్సినేషన్ సెంటర్ & బ్రాంకోస్కోపీ సూట్ ప్రారంభించబడింది

న్యూఢిల్లీ, ఆగస్టు 9:డైరెక్టర్ జనరల్ మెడికల్ సర్వీసెస్ (ఆర్మీ) మరియు సీనియర్ కల్నల్ కమాండెంట్ లెఫ్టినెంట్ జనరల్ సాధన ఎస్ నాయర్ ఆగస్టు 09, 2025న న్యూఢిల్లీలోని ఆర్మీ హాస్పిటల్ రీసెర్చ్ & రెఫరల్‌లో వయోజన వ్యాక్సినేషన్ సెంటర్ మరియు అత్యాధునిక బ్రాంకోస్కోపీ సూట్‌ను ప్రారంభించారు.

ఈ కేంద్రం అర్హులైన అన్ని వయోజనులకు సమగ్ర రోగనిరోధక సేవలను అందిస్తుంది, ఇన్ఫ్లుఎంజా, న్యుమోకాకస్, హెపటైటిస్ మరియు ఇతర నివారించగల వ్యాధులకు వ్యాక్సిన్‌లను అందిస్తుంది.

కొత్తగా స్థాపించబడిన బ్రోంకోస్కోపీ సూట్ విస్తృత శ్రేణి రోగనిర్ధారణ మరియు చికిత్సా వాయుమార్గ విధానాలను నిర్వహించడానికి అధునాతన సాంకేతికతతో అమర్చబడి ఉంది. ఆసుపత్రిని సందర్శించే రోగులకు నివారణ ఆరోగ్య సంరక్షణ మరియు అధునాతన రోగనిర్ధారణ సామర్థ్యాలను పెంపొందించడం ఈ సౌకర్యాల లక్ష్యం.

ప్రారంభోత్సవ కార్యక్రమంలో కమాండెంట్ లెఫ్టినెంట్ జనరల్ శంకర్ నారాయణ్; డిప్యూటీ కమాండెంట్ మేజ్ జనరల్ అమూల్ కపూర్, ఆసుపత్రి, స్టేషన్ మరియు డైరెక్టరేట్ నుండి సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

# ఉగ్రవాద నిర్మూలనే "ఆపరేషన్ సింధూర్' - సురభి వాణి దేవి ఎమ్మెల్సీ

## "ఆపరేషన్ సింధూర్ "కవిత్వ సంకలనం ఆవిష్కరణ.



హైదరాబాద్, ఆగష్టు 9: పీ. వీ. సాహిత్య పీఠం. కరీంనగర్. & శరత్ సాహితీ కళా స్రవంతి, కరీం నగర్ సంయుక్త ఆధ్వర్యంలో డా. సబ్బని లక్ష్మీనారాయణ గారి సంపాదకత్వంలో వెలువడిన 'ఆపరేషన్ సింధూర్' కవిత్వ సంకలనం ఆవిష్కరణ కార్యక్రమం ఈ నెల 7న గురువారం నాడు మధ్యాహ్నం 2 గంటలకు శ్రీ వెంకటేశ్వర గ్రూప్ ఆఫ్ కాలేజీలు మాదాపూర్, హైదరాబాద్ నందు జరిగింది. ప్రముఖ కవి సంకేపల్లి నాగేంద్రశర్మ సభాధ్యక్షత వహించిన కార్యక్రమానికి శ్రీమతి సురభి వాణి ఎమ్మెల్సీ గారు, ముఖ్య అతిథిగా వచ్చి పుస్తకమును ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఇప్పటి తరం దేశభక్తి గురించి తెలుసుకోవలసిన అవసరం ఉందని అన్నారు. దేశశభక్తి అంటే ఎవరి పనిని వారు క్రమ శిక్షణయుతంగా చేయడమే అని చెప్పారు. ఆపరేషన్ సింధూర్ ఘటన లో మన దేశం చూపిన శౌర్యం ను స్ఫూర్తిగా నేటి విద్యార్థులు తీసుకోవాలని చెప్పారు. ఇట్టి కార్యక్రమానికి అతిథులుగా ప్రముఖ పద్య కవి డా.ఆచార్య ఫణీంద్ర, ప్రముఖ న్యాయవాది శ్రీ గులాబీల మల్లారెడ్డి, పీ. వీ. సాహిత్య పీఠం. అధ్యక్షులు కె. వి. సంతోష్ బాబు. సురభి అజిత, శేఖర్ దంపతు లు, ఛత్రపతి శ్రీనివాస్,సాయి సుమంత్, జనగాని యుగేందర్, గందే పరశు రాంరావు, చెవ్వాకుల రామకృష్ణ, కాలేజ్ విద్యార్థులు, అధ్యాపకులు పాలొన్నారు. కార్యక్రమములో సురభి వాణి దేవి గారిని సంస్థ నిర్వాహకులు సన్మాన పత్రం సమర్పిస్తూ ఘనంగా సన్మానించారు. ఆహుతులైన కవుల ను, సంకలనంలో కవితలు వ్రాసిన కవుల ను నిర్వాహకులు సన్మానించారు.

# బీసీల బహిరంగ సభను విజయవంతం చేయాలి



కరీంనగర్, ఆగష్టు 9: (నేటినిజం ప్రతినిధి) బీసీలకు 42% రిజర్వేషన్ కనిపించాలన్న డిమాండ్తో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 14న స్థానిక సర్కస్ గ్రౌండ్లో నిర్వహించే బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో బీసీలు రావాలని బిఆర్ఎస్ నేతలు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక బిఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో శాసనమండలి బిఆర్ఎస్ పక్ష నేత మధుసూదనా చారి మాజీ మంత్రి ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాజీ ఎమ్మెల్యేలు ఒడితెల సతీష్ కుమార్ రసమయి బాలకిషన్ సుంకె రవిశంకర్ మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్లు సమావేశమయ్యారు. ఈ సమావేశం లో ఐదు నియోజకవర్గాల నుండి ఎంత మంది బీసీలను తరలించాలని చర్చించారు. బీసీలు ఈ సభకు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు అన్ని నియోజకవర్గాల నుండి బీసీలను తరలించాలని నిర్ణయించారు. బీసీల రిజర్వేషన్ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ప్రజలు ప్రజల్లో ఎండకడతామని తెలిపారు కాంగ్రెస్ పార్టీ కి చిత్తశుద్ధి లేదని బీసీలను మోసం చేస్తుందనీ విమర్శించారు. ఈ నెల 11న మరోసారి నియోజకవర్గాలకు చెందిన నాయకులతో సమావేశం అవుతున్నట్లు తెలిపారు. బీసీలు పెద్ద సంఖ్యలో సభకు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ స్పీకర్ మధుసూదనాచారి , మాజీ మంత్రి కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎమ్మెల్యేలు సుంకే రవిశంకర్, రసమయి బాలకిషన్, ఒడితెల సతీష్ కుమార్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, పార్టీ జిల్లా అధ్యక్షులు జివి రామకృష్ణారావు, నగర బి ఆర్ ఎస్ అధ్యక్షులు చల్ల హరి శంకర్. పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గాజాను స్వాధీనం చేసుకోవట్లేదు.. హమాస్ నుంచి విముక్తి ప్రసాదిస్తున్నాం : ఇజ్రాయెల్ ప్రధాని

న్యూఢిల్లీ, ఆగష్టు 9:హమాస్తో జరుగుతున్న పోరును మరింత తీవ్రతరం చేసి గాజా ను స్వాధీనం చేసుకోవాలన్న ప్రణాళికకు ఇజ్రాయెల్ సెక్యూరిటీ క్యాబినెట్ ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. హమాస్ను ఓడించడానికి గాజాను స్వాధీనం చేసుకోవాలన్న ప్రధాని ప్రతిపాదనను మంత్రివర్గం గురువారం ఆమోదించింది. అయితే, ఇజ్రాయెల్ నిర్ణయంపై వివిధ వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. దీంతో తన నిర్ణయంపై నెతన్యాహు వివరణ ఇచ్చారు. గాజా నగరానికి సంబంధించిన తన ప్రణాళికను వివరిస్తూ ఎక్స్ వేదికగా ఓ పోస్టు పెట్టారు. తాము గాజాను ఆక్రమించుకోవడం లేదని.. హమాస్ నుంచి విముక్తి ప్రసాదించనున్నట్లు స్పష్టం చేశారు.

'వేము గాజాను ఆక్రమించుకోవడం లేదు. హమాస్ నియంత్రణ నుంచి విముక్తి ప్రసాదించనున్నాం. భవిష్యత్తులో అక్కడ ఎలాంటి సైనిక కార్యకలాపాలు జరగకుండా చేయడవే మా ప్రణాళికలో భాగం. శాంతియుత పౌర పరిపాలనను నెలకొల్పడానికి కట్టుబడి ఉన్నాం. పాలస్తీనా, హమాస్ సహా ఇతర ఉగ్రవాద సంస్థలతో కూడిన పరిపాలన ఆ ప్రాంతంలో ఉండదు. ఈ చర్య హమాస్ చెరలో బందీలుగా ఉన్న పౌరులను విడిపించడంలో దోహదపడుతుంది. అలాగే భవిష్యత్తులో గాజా నుంచి ఇజ్రాయెల్కు ఎటువంటి భద్రతా ముప్పు రాకుండా చేస్తుంది' అని నెతన్యాహు ఎక్స్ పోస్టులో రాసుకొచ్చారు. ప్రస్తుతం ఈ పోస్టు వైరల్ అవుతోంది.

హమాస్తో 22 నెలలుగా సాగుతున్న యుద్ధానికి ముగింపు పలికేందుకు ఐదు అంశాలతో కూడిన ప్రత్యేక ప్రణాళికను ఇజ్రాయెల్ భద్రతా మంత్రివర్గం గురువారం ఆమోదించింది. అయితే, ఈ నిర్ణయాన్ని ప్రపంచ దేశాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. బ్రిటన్, చైనా, సౌదీ అరేబియా, ఆస్ట్రేలియా, బెల్జియం వంటి అనేక దేశాలు టెల్అవీవ్ నిర్ణయాన్ని ఖండించాయి. టెల్అవీవ్కు యుద్ధ సామగ్రి సరఫరా చేయబోమని జర్మనీ స్పష్టం చేసింది. దీంతో నెతన్యాహు పైవిధంగా స్పందించారు. గాజాపై తన నిర్ణయాన్ని స్పష్టం చేశారు.

# వేద ఇతిహాస పురాణాలు మన పునాదులు

## -వేద పాఠశాల ఆచార్యులు వర ప్రసాద్ గారు



హైదరాబాద్, ఆగష్టు 9:భారత సనాతన నాగరికతకు, హిందూ సమాజ జీవన విధానాలకు పునాదులుగా మన సంస్కృత భాషలో బోధించిన వేద, ఇతిహాస, పురాణాలు పునాదులని శ్రీ శ్రీ శ్రీ చిన్నజీయర్ స్వామి ట్రస్ట్ కు సంబంధించిన వేద పాఠశాల ఆచార్యులు వర ప్రసాద్ గురుజీ పేర్కొన్నారు. ఈ రోజు కరినగరం మానేరు డ్యామ్ సమీప వేద పాఠశాల ఆవరణలో లీడ్ ఇండియా నేషనల్ క్లబ్, శాతవాహన లయన్స్ క్లబ్ సంయుక్త నిర్వహణలో నిర్వహించిన ప్రపంచ సంస్కృత దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ, విద్యావ్యవస్థ సంపన్నులు కావడానికి మన చదువులు ఉపయుక్తంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథిగా పాల్గొన్న లీడ్ ఇండియా అధ్యక్షులు లయన్: కెప్టెన్: డాక్టర్: బుర్ర మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ, ఉపాధ్యాయుడి మాటలు తన విద్యార్థులు మాత్రమే వింటారని, వేద అధ్యయనం చేసిన రుషితుల్యులైన గురువుల సలహాలను, బోధనలను పౌర సమాజం మొత్తం వింటుందని అన్నారు. మన వేదాలు, పురాణాలు, ఇతిహాసాలు అన్ని సంస్కృత భాషలో ఉన్నాయని, అన్ని భాషలకు తల్లి వలె సంస్కృతం భాష నిలుస్తున్నదని అన్నారు. దేవతల భాష అయిన సంస్కృతం తగిన వారు సదా పౌర సమాజంలో పూజలు అందుకుంటున్నారని తెలిపారు. సంస్కృత భాష అధ్యయనంతో ఉచ్ఛరణ, మాటలో స్పష్టత, చిన్న పదాల్లో పెద్ద భావాలను వ్యక్తం చేయడం జరుగుతుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సంస్కృత పండితులు ఆచార్య శ్రీ వర ప్రసాద్ గురువులను ఘనంగా సన్మానించి, వేద పాఠశాల విద్యార్థులకు పండ్లు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో శాతవాహన లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ డి. తిరుపతి రెడ్డి, లయన్ ఎం సత్యనారాయణ రావు, ఎం మహేందర్లతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రాఖీ పౌర్ణమి వేడుకల్లో పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ విప్

రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 9:(నేటి నిజం ప్రతినిధి):. రాఖీ పౌర్ణమి పర్వ దినాన్ని పునస్కరించుకొని వేములవాడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజాహిత బ్రహ్మ కుమారి ఈశ్వరియా విశ్వవిద్యాలయ రాజా యోగ శిక్షణ కేంద్ర సభ్యులు రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది...ప్రభుత్వ విప్ మట్లాడుతూ అక్కతమ్ముడు అన్నా చెల్లెళ్ళ మధ్య అపారమైన ప్రేమను సూచించే ఈ రాఖీ పండుగ సౌభ్రాతృత్వం వెల్లివిరిసేల ఆనందోత్సాహాలతో జరుపుకోవాలన్నారు. ఈ రాఖీ పండగ ప్రతి మహిళా జీవితంలో ఆనందం నింపాలని ఆ దేవుడిని ప్రార్థిస్తు, రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు



# ఘనంగా యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

## కేక్ కట్ చేసి, రోగులకు పండ్లు పంపిణీ చేసిన యూత్ కాంగ్రెస్ నాయకులు



రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 9:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్ ఆర్టీసీ బస్టాండ్ వద్ద యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను స్థానిక శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదేశానుసారం, వేములవాడ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ , వేములవాడ పట్టణ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం యూత్ కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా నాయకులు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి నాగం మురళి, వేములవాడ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఇన్నారం సాగర్,వేములవాడ అర్బన్ అధ్యక్షుడు చిట్ల శ్రీనివాస్, కోనరావు పేట మండల అధ్యక్షుడు బండి ప్రభాకర్ సోషల్ మీడియాఇంచార్జ్ అజయ్,వినయ్ సాగర్ భాస్కర్ సునీల్ ఇర్ఫాన్ నవీన్. అశోక్ వంశీ శేఖర్ హరీష్ నాగరాజ్ సల్మాన్ నవీన్ నక్క . యూత్ కాంగ్రెస్ నాయకులు అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు

# గిరిజన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి : మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య

కారేపల్లి, ఆగస్టు 09 : గిరిజన చట్టాలు, హక్కులపై గిరిజన యువత తప్పక అవగాహన కలిగి ఉండాలని మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య అన్నారు. ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని శనివారం ఖమ్మం జిల్లా సింగరేణి (కారేపల్లి) మండల కేంద్రంలో ఆదివాసి గిరిజనుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గుమ్మడి నరసయ్య మాట్లాడుతూ.. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు పరిరక్షించుకోవాలన్నారు. ఆదివాసులు పండించిన అటవీ ఉత్పత్తులు, వైవిద్యం పెంపొందించడానికి ప్రభుత్వం గ్రామాల్లోని గిరిజన యువతకు నైపుణ్య అభివృద్ధి శిక్షణలు కల్పించాలన్నారు.

# సోదరీమణుల ప్రేమ, ఆప్యాయత నాకు ఎప్పటికీ ప్రత్యేకం : హరీశ్రావు

హైదరాబాద్, ఆగష్టు 9:రాఖీ పండుగ సందర్భంగా మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్రావు నివాసంలో సందడి వాతావరణం నెలకొంది. అన్నా చెల్లెళ్ల బంధానికి ప్రతీకగా జరుపుకునే ఈ వేడుకలో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ జెడ్పీ చైర్ పర్సన్ తుల ఉమతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అక్కాచెల్లెమ్మలు ఆత్మీయంగా రాఖీ కట్టారు. ఆయురారోగ్యాలతో ఉండాలని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ.. సోదరీమణుల ప్రేమ, ఆప్యాయత నాకు ఎప్పటికీ ప్రత్యేకం. తెలంగాణలో ప్రతి సోదరి సుఖసంతోషాలతో ఉండాలని, వారికి ఎలాంటి ఇబ్బందులు రాకూడదని భగవంతుడిని కోరుకుంటున్నాను అని తెలిపారు. రాఖీ కట్టిన సోదరీవణులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# ఇందిరమ్మ ఇల్లు మంజూరైన చెల్లెలితో మైలారం రాము రక్షా బంధన్



రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 9:(నేటి నిజం ప్రతినిధి): రాఖీ పౌర్ణమి అంటే అక్కలు తమ్ముళ్ళకు, చెల్లెళ్ళు అన్నలకు రాఖీలు కట్టడం మామూలుగా చూస్తుంటాం కానీ దీనికి భిన్నంగా శనివారం వేములవాడ పట్టణంలో జరిగిన రాఖీ పండగలో అపూర్వ సంఘటన చోటు చేసుకుంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగావేములవాడ పట్టణంలోని మహిళకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇలు మంజూరు చేసింది. ప్రస్తుతం ఇంటి నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. అయితే తనకు ఇంది రమ్మ ఇల్లు రావడం చాలా సంతోషంగా ఉందని, ఎన్నో ఏళ్ల తన స్వంత ఇంటి కల నెరవేరబోతుందని హర్షం వ్యక్తం చేసింది రాఖీ పండుగ సందర్భంగా ఎంతో ప్రేమతో అభిమానాన్ని చాటుకుంది. ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సహకారంతో ఇళ్ళు మంజూరుకు కృషి చేశారు ఈ అక్క తమ్ముళ్ళ అను బంధం చూసిన ప్రతి ఒక్కరూ ఇదే నిజమైన రాఖీ పండగ అంటూ ఇద్దరిపై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

# దేశవ్యాప్తంగా కిరాణా సభ్యులను శక్తివంతం చేయడానికి 'ఫ్రీడమ్ ఫెస్ట్ 2025' ను ప్రారంభించిన ఫ్లిప్కార్ట్ హోల్సేల్

Best Price is now Flipkart Wholesale

హైదరాబాద్, ఆగష్టు 9: భారతదేశ స్వదేశీ ఫ్లిప్కార్ట్ గ్రూప్కు చెందిన డిజిటల్ ః2ః మార్కెట్ప్లేస్ అయిన ఫ్లిప్కార్ట్ హోల్సేల్, తన వార్షిక 'ఫ్రీడమ్ ఫెస్ట్' ఈవెంట్ను ఈ ఏడాది ఆగస్టు 9 నుండి ఆగస్టు 15, 2025 వరకు దేశవ్యాప్తంగా సభ్యుల కోసం ప్రకటించింది. భారతదేశం 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని, ఫ్రీడమ్ ఫెస్ట్ 6000కు పైగా ఉత్పత్తులపై 79% వరకు అద్భుతమైన తగ్గింపులతో సభ్యులను సాధికారత కల్పించేందుకు ఈ ప్రత్యేక అవకాశాన్ని అందిస్తోంది.'ఆప్కీ ఆజాదీ, 'ఆప్కీ బచత్' అనే ట్యాగ్లైన్తో ఫ్లిప్కార్ట్ హోల్సేల్ వార్షిక 'ఫ్రీడమ్ ఫెస్ట్' సేల్ వినియోగదారులకు బడ్జెట్ ఫ్రెండ్లీ డీల్స్ను అందిస్తోంది. ఈ సేల్లో -203కే ఎంపిక చేసిన ఉత్పత్తులు, ?899కే (గతంలో -999) 12 నెలల సేవ్ ఈజీ ప్రోగ్రామ్లో చేరిక లేదా పునరుద్ధరణ, గడువు ముగిసిన సభ్యులకు -2000 విలువైన కొనుగోళ్లపై క్యాష్బ్యాక్, అలాగే 12 నెలల సేవ్ ఈజీ లాయల్టీ ప్రోగ్రామ్ పునరుద్ధరణపై హామీ బహుమతి వంటి- ఆఫర్లు ఉన్నాయి. ఈ వార్షిక ఫ్లాగ్షిప్ ఈవెంట్ ఫ్లిప్కార్ట్ హోల్సేల్ స్టోర్లు మరియు మొబైల్ యాప్లో అందుబాటులో ఉంటుంది.మిస్టర్. దినకర్ ఐలవరపు, వైస్ ప్రెసిడెంట్ మరియు హెడ్, ఫ్లిప్కార్ట్ హోల్సేల్ ఇలా అన్నారు, "ఈ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని 'ఫ్రీడమ్ ఫెస్ట్'ను ప్రారంభించడంలో మేము ఎంతో ఆనందంగా ఉన్నాము. ఈ సేల్ మా భాగస్వాములకు ప్రాముఖ్యత కలిగిన ప్రయోజనాలను, మించిన పొదుపులను అందించడవే లక్ష్యంగా రూపొందించబడింది. గత సంవత్సరం కిరాణా సభ్యుల విశేష స్పందన మా నిబద్ధతను మరింత బలపరిచింది, వారిని శక్తివంతం చేయడంలో మా పాత్రను నిరూపించింది.

ఈ సంవత్సరం, డిజిటల్ వాణిజ్యాన్ని ప్రోత్సహిస్తూ, వారి వ్యాపార పరిధిని విస్తరించేందుకు మేము మరింత సహకరించాలనుకుంటున్నాము. భారతదేశంలోని ః2ః ఈ-కామర్స్ పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడం, చిన్న రిటైలర్లు వృద్ధి చెందేలా స్థిరమైన మార్గాన్ని రూపొందించడం పట్ల ఫ్లిప్కార్ట్ హోల్సేల్ నిబద్ధతగా ముందుకు కొనసాగుతుంది."పొదుపును మరింతగా పెంచేందుకు, ఫ్లిప్కార్ట్ హోల్సేల్ 7 రోజుల ఉచిత క్రెడిట్ సౌకర్యాన్ని అందిస్తోంది, దీనివల్ల సభ్యులు ాఃఎ వంటి ప్రముఖ బ్యాంకులతో భాగస్వామ్యంగా కొనుగోలు చేసి తరువాత చెల్లించే వెసులుబాటు పొందవచ్చు. ాఃఎ క్రెడిట్ కార్డ్ మరియు క్రెడిట్ కార్డ్ ఇఓఎ లావాదేవీలపై ?500 ఫ్లాట్ క్యాష్బ్యాక్, అలాగే ఈ-పే లేటర్, మొబిక్విక్ ఐఖఎ, వాలెట్ వంటి వివిధ చెల్లింపు ఆప్షన్లు అందుబాటులో ఉన్నాయి. ఈ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రారంభించిన ఫ్రీడమ్ ఫెస్ట్ ద్వారా, ఫ్లిప్కార్ట్ హోల్సేల్ తన సాంకేతిక సామర్థ్యాలు మరియు మార్కెట్ అంతర్దృష్టుల ఆధారంగా కిరాణాలు మరియు ఓఓఇల కోసం ప్రత్యేకమైన పొదుపు అవకాశాలు, వ్యక్తిగతీకరించిన ప్రయోజనాలను అందిస్తూ, వారి వ్యాపార వృద్ధికి బలమైన మద్దతును అందించడాన్ని లక్ష్యంగా పెట్టుకుంది.ఫ్రీడమ్ ఫెస్ట్ గురించి మరింత తెలుసుకోవడానికి, దయచేసి https://www.bestprice.in/ ని సందర్శించండి.

# ఆదివాసీల హక్కుల సాధనకై ఐక్య పోరాటాలు'

ఖమ్మం, ఆగష్టు 9: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండల కేంద్రంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆదివాసీల ఆరాధ్య దైవం కొమరం భీమ్ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాలర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. కాకతీయులపై సమ్మక్క, సారలమ్మల వీరోచిత తిరుగుబాటు, ఆంగ్లేయులపై బిర్సా ముండా ఉద్యమాలను ఆదర్శంగా తీసుకుని ఆదివాసీల హక్కుల సాధనకై ఐక్యపోరాట కార్యాచరణ చేసి సమస్యలు పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు పోడియం బాలరాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పూణెనీ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ తాటి.పద్మ, నాగమణి, అనిత, శోభారాణి, కుమారి, రాములమ్మ, ఏఈడబ్ల్యూసీఏ నాయకులు తెల్లం వెంకటేశ్వర్లు, జేజే రాంబాబు, పెండకట్ల కృష్ణయ్య, పోలెబోయిన వెంకటేశ్వర్లు, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు పూణెనీ నర్సయ్య, చుంచు జగన్, తాటి తిరుమల్, తాటి అశోక్, కుంజ హైమవతి, ఆర్టీసీ ఆదివాసీ ఉద్యోగులు సూరిబాబు, సారయ్య, చింత రాములు, శ్రీనివాస్, కొమరం భీమ్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

# వేములవాడలో రాఖీ పండుగ సందడి-ఎమ్మెల్యేకు సెస్ డైరెక్టర్ రాఖీ

రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 9:(నేటినిజం ప్రతినిధి):, వేములవాడ టౌన్ సెస్ డైరెక్టర్ నామాల ఉమా, శనివారం వేములవాడ



ఎమ్మెల్యే మరియు ప్రభుత్వ విప్ కి రాఖీ కట్టారు. ఈ సందర్భంగా నామాల ఉమా మాట్లాడుతూ, సోదరసోదరి బంధం పవిత్రమైన దని, రాఖీ పండుగ ఆ అనుబంధా నికి ప్రతీక అని తెలిపారు. సోదరీ మణుల రక్షణకు కట్టుబడి ఉంటా ఎమ్మెల్యేరాఖీ కట్టిన అనంతరం ఎమ్మెల్యే గారు సోదరీమణుల రక్షణ, గౌరవం కోసం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటానని హామీ ఇచ్చారు. అనంతరం సాంప్రదాయ పద్ధతిలో తిలకములు పెట్టి, స్వీట్లు పంచుకున్నారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో టౌన్ సెస్ సిబ్బంది, స్థానిక మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# నేడు హైదరాబాద్లో ట్రాఫిక్ ఆంక్షలు..

హైదరాబాద్, ఆగష్టు 9:ప్రముఖ టాలీవుడ్ నటుడు జూనియర్ ఎన్టీఆర్ నటించిన వార్ 2 ప్రీ రిలీజ్ ఈవెంట్ ఆదివారం హైదరాబాద్ నగరంలో జరగనుంది. ఈ ప్రీ రిలీజ్ ఈవెంట్కు యూసుఫ్గూడ బెటాలియన్ పోలీసు లైన్స్ వేదిక కానుంది. ఆదివారం సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఈ వేడుక జరగనుంది. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసులు ఆ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.

ట్రాఫిక్ ఆంక్షలు ఇలా..

-జూబ్లీహిల్స్ చెక్పోస్టు నుంచి కోట్ల విజయ్ భాస్కర్ రెడ్డి స్టేడియం వైపు వచ్చే వాహనాలను కృష్ణా నగర్ జంక్షన్ వద్ద మళ్లించి, శ్రీనగర్ కాలనీ, పంజాగుట్ట వైపునకు మళ్లించనున్నారు.మైత్రివనం జంక్షన్ నుంచి జూబ్లీహిల్స్ చెక్ పోస్టు, మాదాపూర్ వైపు వెళ్లే వాహనాలను యూసుఫ్గూడ బస్తీ నుంచి ఆర్బీఐ క్వార్టర్స్, కృష్ణా నగర్ జంక్షన్ వైపు మళ్లించనున్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.